




# శివసూర్య

SHIVA SURYA TELUGU DAILY

RNI APTEL : 2023/88704

తెలుగు దిన పత్రిక





శివసూర్య

విలేకర్లు కావలెను

కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

ఎడిటర్ : బి. శివరాముడు

9494741301, 9346185399.



కర్నూలు సంపుటి : 03, సంచిక : 314 ఛీఫ్ ఎడిటర్.. పేజీలు : 08, వెల రూ. 2రూ/ శుక్రవారం - 17 - జులై - 2026

Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,


## ఇస్రోలో వరుస రాజీనామాలు.. రంగంలోకి దిగిన కేంద్రం!

**కీలక మిషన్ల శాస్త్రవేత్తల రాజీనామాలపై కేంద్రం కఠిన నిర్ణయం**

**శాస్త్రవేత్తల రాజీనామాలు ఇక సాధారణంగా ఆమోదించ వద్దని ఆదేశం**

**తుది నిర్ణయం అంతరిక్ష శాఖే తీసుకోనుందంటూ అంతర్గత మెమో**




ఢిల్లీ,: ఇస్రోలో కీలక ప్రాజెక్టులపై పనిచేస్తున్న శాస్త్రవేత్తలు వరుసగా రాజీనామాలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర అంతరిక్ష శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్‌తో పాటు ఇతర ప్రధాన మిషన్లలో ఉన్న శాస్త్రవేత్తల స్వచ్ఛంద పదవీ విరమణ, రాజీనామాలపై కఠిన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. జులై 14న విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం..

## సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం.. కాంగ్రెస్ పై రాంచందర్ రావు ఫైర్

**సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో ఘటన**

**ఇస్లామిక్ సూక్తులు నేర్చుకోవాలంటూ హిందూ విద్యార్థికి హోంవర్క్**

**డైరీని గమనించి షాక్ కు గురైన తల్లిదండ్రులు**




**స్కూలు గుర్తింపు రద్దు చేయాలన్న రాంచందర్ రావు**

హైదరాబాద్, : హైదరాబాద్ పాతబస్తీ పరిధిలోని సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో చోటుచేసుకున్న సంఘటన ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. అక్కడి 'సక్సెస్ స్కూల్'లో రెండో తరగతి చదువుతున్న ఒక హిందూ విద్యార్థికి... ఇస్లామిక్ పవిత్ర సూక్తులైన 'కల్మా', 'సూరహ్ అల్-ఫాతిహా' చదివి,

## హర్మూజ్ జలసంధికి వెళ్లొద్దు.. భారత నావికులపై కేంద్రం ఆంక్షలు




**హర్మూజ్ జలసంధి గుండా భారత నావికులను పంపవద్దని ఆదేశాలు**

**నౌకల యజమానులకు, మేనేజర్లకు డీజీఎంఏ ఉత్తర్వుల జారీ**

ఢిల్లీ,:గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల్లో భారత నావికులను తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకు నియమించవద్దని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ (డీజీఎంఏ) స్పష్టమైన ఆదేశాలు జారీ




## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు

## ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు: బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఆదరించలేదని బీఆర్ఎస్ కక్షగట్టిందన్న పొంగులేటి
- సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపాటు
- అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని ఆగ్రహం




హైదరాబాద్, : ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# కేసీఆర్ హయాంలో ఇరిగేషన్ వ్యవస్థను నాశనం చేశారు.. మంత్రి ఉత్తమ్ ధ్వజం

- ★ కమీషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలింది
- ★ మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు
- ★ బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారు
- ★ సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు
- ★ గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోంది




భద్రాద్రి కొత్తగూడెం, : కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమీషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కొనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?.. కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ
- డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్
- సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి
- ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు
- పార్టీలకు అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని విన్నపం

ఢిల్లీ,:పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని




కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం




## మేం వచ్చాక స్కూళ్లలో హిందూ విద్యార్థులకు బొట్టు తప్పనిసరి చేస్తాం: బండి సంజయ్

## 100 కేసులు పెట్టినా భయపడను.. ముద్రగడ ఆత్మ శాంతి కోసమే అడ్డుకున్నా




**ప్రభుత్వం తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసిందన్న అంబటి**

**ముద్రగడ బతికున్నప్పుడు ఆయనను చిత్రహింసలకు గురిచేశారని మండిపాటు**

**ప్రభుత్వంపై కాపు సామాజికవర్గంలో వ్యతిరేకత వ్యక్తమవుతోందని వ్యాఖ్య**

అమరావతి,: కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల వేళ పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై తనపై కేసు నమోదు కావడం పట్ల మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో కాపులపై వేధింపులు విపరీతంగా పెరిగాయని ఆరోపిస్తూ, తనను ప్రభుత్వం వ్యక్తిగతంగా టార్గెట్ చేసిందని

## రాయలసీమ కరవుకు గోదావరి జలాలే శాశ్వత పరిష్కారం: సత్యకుమార్ యాదవ్




పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సత్యకుమార్, పురందేశ్వరి, మాధవ్ తదితరులు

- పోలవరం కోసం మరో రూ. 30 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం రెడీగా ఉందన్న సత్యకుమార్
- పోలవరంను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న మాధవ్

# 'జగన్ 2.0 సూపర్ యాప్' ఆవిష్కరణ

- పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తలు కోసం యాప్ డిజైన్ చేశారు
- ఈ యాప్ వల్ల ప్రతి కార్యకర్త నిత్యం, పార్టీ నాయకత్వంతో అనుసంధానమై ఉంటాడు"
- ఇది ఒక మంచి పరిణామం. ఇష్టం వచ్చినట్లు చేసే కుట్రలు కూడా దీనివల్ల తిప్పి కొట్టొచ్చు.'
- ఇవన్నీ జరుగుతున్న నేపథ్యంలో మనమే ఒక యాప్ తీసుకొచ్చి ఒక ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేస్తున్నాం




తాడేపల్లి: పార్టీ కేంద్ర కార్యాలయంలో 'జగన్ 2.0 సూపర్ యాప్'ను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తలు కోసం యాప్ డిజైన్ చేశారు. పార్టీ నేతలంతా నేరుగా కార్యకర్తలతో టచ్‌లో ఉండేలా ఈ యాప్‌ను రూపొందించారు. సందర్భంగా వైఎస్ జగన్



మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నుంచి ఇవాళ అధికారిక 'జగన్ 2.0 సూపర్ యాప్'ను ఆవిష్కరిస్తున్నామన్నారు. "ఈ రోజు ఏం జరుగుతోంది అంటే.. సోషల్ మీడియాలో మన వాళు పోస్ట్ చేసిన కంటెంట్‌ను ఇష్టం వచ్చినట్లుగా డిలీట్ చేయడం, అందుకోసం ఇష్టానుసారం కుట్రలు పన్నడం..

## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి.. 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి




- భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం ఖాయమన్న సీఎం చంద్రబాబు
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమని వెల్లడి
- పీపీపీ కింద రూ.1.23 లక్షల కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు
- నిరర్థక ప్రభుత్వ ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని ఆదేశం

అమరావతి,: రాష్ట్రంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానమే కీలకమని, భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కూడిన ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులు తేనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా ఉండాలి




- పూరీ జగన్నాథ్ రథయాత్రను పురస్కరించుకుని భక్తులకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు
- ప్రతి కుటుంబానికి స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించిన పవన్
- ప్రతి ఇంటిని సుఖ సంతోషాలతో నింపాలని ఆకాంక్ష

# ఇస్రోలో వరుస రాజీనామాలు.. రంగంలోకి దిగిన కేంద్రం!

మొదటి పేజి తరువాయి

జులై 14న విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం.. గగన్‌యాన్, ఇతర కీలక ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న గ్రూప్-ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను ఇకపై సాధారణంగా ఆమోదించరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు అలాంటి అభ్యర్థనలను కేంద్రాల డైరెక్టర్లు ఆమోదించకుండా, తమ సిఫార్సులతో పాటు అంతరిక్ష శాఖకు పంపాలని ఆదేశించింది. తుది నిర్ణయం మంత్రిత్వ శాఖే తీసుకోనుంది. ఇస్రోలో ఇటీవల రాజీనామాలు పెరిగిన విషయాన్ని పరోక్షంగా అంతరిక్ష శాఖ గుర్తించింది. అయితే ఎంతమంది వెళ్లారనే అధికారిక వివరాలు వెల్లడించలేదు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో మాట్లాడిన ఇస్రో వర్గాల ప్రకారం కనీసం 100 నుంచి 120 మంది వరకు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వారిలో యూఆర్ఎస్‌సీ నుంచి సుమారు 80 మంది, వీఎస్ఎస్‌సీ నుంచి కనీసం 20 మంది ఉన్నట్లు సమాచారం. ఎల్‌వీఎం-3 ప్రాజెక్ట్ డైరెక్టర్ విక్టర్ జోసెఫ్, స్పాడెక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు చంద్రయాన్-3లో కీలకంగా పనిచేసిన ఓ యువ శాస్త్రవేత్త కూడా రాజీనామా చేసినట్లు వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలపై ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ స్పందించారు. రాజీనామాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, అయితే ప్రతి సంస్థలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయన్నారు. కీలక ప్రాజెక్టులకు ఒక్కసారిగా అంతరాయం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా వెళ్లినా వారి బాధ్యతలను మరొకరు చేపడతారని, పరిస్థితిని ఇస్రో సమర్థంగా నిర్వహిస్తోందని వెల్లడించారు. ఇస్రోలో మొత్తం 14,600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నప్పటికీ, రాజీనామాలు చేసినవారిలో కీలక మిషన్లకు చెందిన అనుభవజ్ఞులు ఉండటమే ఆందోళన కలిగిస్తోంది. చంద్రయాన్-3లో ల్యాండింగ్ ప్రక్రియ ధ్రువీకరణకు అవసరమైన లక్షకు పైగా పరీక్షలు నిర్వహించి, దాదాపు 25 టెరాబైట్ల డేటాను సిద్ధం చేసిన ప్రాజెక్ట్ మేనేజర్ ఆదిత్య రాళ్లపల్లి కూడా సంస్థను వీడినట్లు సమాచారం. 2020లో జారీ చేసిన నిబంధనల ప్రకారం గ్రూప్-ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలను సంబంధిత కేంద్రాల డైరెక్టర్లే ఆమోదించే అధికారం ఉండేది. తాజా ఆదేశాలతో గగన్‌యాన్, ఇతర ప్రధాన మిషన్లలో పనిచేసే శాస్త్రవేత్తల విషయంలో ఆ అధికారాన్ని వెనక్కి తీసుకుంది. ఖాళీలను భర్తీ చేయడం కంటే అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలను భర్తీ చేయడం అంత సులభం కాదనే అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాజా ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

# సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం.. కాంగ్రెస్ పై రాంచందర్ రావు ఫైర్

మొదటి పేజి తరువాయి

ఇస్లామిక్ పవిత్ర సూక్తులైన 'కల్మా', 'సూరహ్ అల్-ఫాతిహా' చదివి, నేర్చుకు రావాలంటూ ఉపాధ్యాయురాలు హోంవర్క్ ఇవ్వడం, స్కూల్ డైరీలో లిఖితపూర్వకంగా రాయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాలుడు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత డైరీని గమనించిన తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చిన్న వయసులోనే విద్యార్థులపై ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంధువులు, స్థానికులతో కలిసి నేరుగా స్కూల్‌కు వెళ్లి యాజమాన్యాన్ని సూటిగా నిలదీశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. బాధితులు వెంటనే సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం వెలుగులోకి రాగానే అలర్ట్ అయిన సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. ఇది సదరు టీచర్ వ్యక్తిగతంగా చేసిన పొరపాటుగా భావిస్తున్నామని పేర్కొంది. ఈ వివాదానికి కారణమైన ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను తక్షణమే విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో తమ విద్యాసంస్థల్లో ఆమెకు ఎలాంటి అవకాశం ఇవ్వబోమని, పాఠశాలలో ఇలాంటి మతపరమైన బోధనలకు తావు లేదని స్పష్టం చేసింది. ఈ ఉదంతంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అత్యంత తీవ్రంగా స్పందించారు. 'కాంగ్రెస్ అంటే ముస్లింలు' అనే ప్రకటనల వల్లే ఇలాంటి శక్తులకు ప్రోత్సాహం లభిస్తోందని మండిపడ్డారు. స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ... చిన్నారిపై మతపరమైన ఒత్తిడి తీసుకురావడం ఘోరమని, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# హర్మూజ్ జలసంధికి వెళ్లొద్దు.. భారత నావికులపై కేంద్రం ఆంక్షలు

మొదటి పేజి తరువాయి

భారత నావికులను తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకు నియమించవద్దని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ (డీజీఎంఏ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నౌకల యజమానులు, షిప్ మేనేజర్లు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు (ఆర్‌పీఎస్ఎల్) ఈ నిబంధనను తక్షణమే పాటించాలని సూచించింది. ఈ వివాదాస్పద ప్రాంతంలో వాణిజ్య నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో భారత నావికుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీఎంఏ తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఇటీవల మొంబాసా బి, అల్ బహ్యా, జీఎఫ్ఎస్ గెలాక్సీ, ఎంటీ వెద్యాన్, అల్ రెకయ్యాత్ వంటి వాణిజ్య నౌకలపై జరిగిన దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ ప్రాంతంలో ప్రయాణించే నావికులకు, నౌకలకు ప్రమాదం గణనీయంగా పెరిగిందని తన ప్రకటనలో పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ముందు జాగ్రత్త చర్యగా ఈ ఆంక్షలు విధించినట్లు స్పష్టం చేసింది.


అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం

పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడమే ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం. ఇరాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించడం, ప్రతిగా ఇరాన్ ఓడరేవులపై అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తిరిగి విధించడంతో పరిస్థితి మరింత దిగజారింది. దీంతో ఇరాన్ కూడా తీవ్రంగా స్పందించింది. తాము అమెరికాతో జీవన్మరణ పోరాటం చేస్తున్నామని, తమ ప్రాంతంలో ఇంధన ఎగుమతులను అడ్డుకుంటామని హెచ్చరించింది. ఈ ఘర్షణ వాతావరణం ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నౌకా రవాణా మార్గమైన హర్మూజ్ జలసంధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఇప్పటికే ఉన్న నౌకలకు సూచనలు

ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి, దాని పరిసర జలాల్లో ఉన్న నౌకల కెప్టెన్లు (మాస్టర్స్) అత్యంత అప్రమత్తంగా ఉండాలని డీజీఎంఏ సూచించింది. భద్రతాపరమైన హెచ్చరికలను నిరంతరం గమనిస్తూ, అంతర్జాతీయ నౌక, నౌకాశ్రయ భద్రతా నియమావళి (ఇస్రూ జశీసవ) ప్రకారం రూపొందించిన షిప్ సెక్యూరిటీ ప్లాన్‌ను కఠినంగా అమలు చేయాలని ఆదేశించింది. ఏదైనా అత్యవసర సహాయం అవసరమైతే, వెంటనే డీజీ కమ్యూనికేషన్ సెంటర్ (ఎంఎండీఏసీ) లేదా భారత నౌకాదళానికి చెందిన ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్-ఇండియన్ ఓషన్ రీజియన్‌ను (ఐఎఫ్‌సీ-ఐఓఆర్) సంప్రదించాలని తెలిపింది. గల్ఫ్ ప్రాంతంలో మారుతున్న పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని, భారత నావికుల భద్రతకు కట్టుబడి ఉన్నామని డీజీఎంఏ భరోసా ఇచ్చింది.

# గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు



హైదరాబాద్, : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

# ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు: బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు. "గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

# మేం వచ్చాక స్కూళ్లలో హిందూ విద్యార్థులకు బొట్టు తప్పనిసరి చేస్తాం: బండి సంజయ్

హైదరాబాద్, : తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే హిందూ విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సైదాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని హోంవర్క్ ఇచ్చారన్న వివాదం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ సంస్కృతిపై బలవంతంగా దాడి చేస్తున్నారని మండిపడ్డారు. హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని ఆదేశించడం దుర్మార్గమని విమర్శించారు. సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనను సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సెక్యులర్ సంఘాలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సైదాబాద్‌లోని సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌లో రెండో తరగతి హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని హోంవర్క్ ఇచ్చినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. స్కూల్ డైరీలో ఈ హోంవర్క్ రాసినట్లు చెబుతున్నారు. మరోవైపు, కల్మా చదవాలని హోంవర్క్ ఇచ్చిన ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి తొలగించినట్లు స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఇలాంటి ఘటన తమ పాఠశాలలో ఇదే తొలిసారి జరిగిందని వివరణ ఇచ్చింది. ఈ ఘటనపై బీజేపీ నేతలు స్కూల్‌ను ముట్టడిస్తామని హెచ్చరించడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కూల్‌కు వెళ్లే మార్గాలను మూసివేశారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా ఈ ఘటనపై స్పందించారు. తెలంగాణలోని కొన్ని పాఠశాలలు హిందూ విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని చిన్నారులను ఇస్లాం వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి పాఠశాలలు, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే వారిని జైలుకు పంపాలని అన్నారు.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?.. కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

మొదటి పేజి తరువాయి


ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు-2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

# 100 కేసులు పెట్టినా భయపడను.. ముద్రగడ ఆత్మ శాంతి కోసమే అడ్డుకున్నా

మొదటి పేజి తరువాయి

కూటమి ప్రభుత్వంలో కాపులపై వేధింపులు విపరీతంగా పెరిగాయని ఆరోపిస్తూ, తనను ప్రభుత్వం వ్యక్తిగతంగా టార్గెట్ చేసిందని ధ్వజమెత్తారు. ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను అంబటి రాంబాబు పూర్తిగా సమర్థించుకున్నారు. చనిపోయిన తర్వాత కూడా ముద్రగడ భౌతికకాయం వద్ద రాజకీయం చేయాలని చూశారని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ముద్రగడ పద్మనాభం బతికున్నప్పుడు ఆయన్ను తీవ్ర చిత్రహింసలకు గురిచేశారని, చనిపోయాక ఇప్పుడు అధికారిక లాంఛనాలు ఇస్తామనడం రాజకీయ కుట్రని అంబటి ఆరోపించారు. "ప్రభుత్వ లాంఛనాలు మాకొద్దు అని ఆయన కుటుంబం ముందే స్పష్టం చేసింది. వాళ్లు వద్దంటున్నా పోలీసులు ఎందుకు వచ్చారు? ముద్రగడ ఆత్మ శాంతించడం కోసమే మేము పోలీసులను అడ్డుకున్నాం. ఇందులో ఎలాంటి తప్పు లేదు" అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, రాష్ట్ర డీజీపీ తనపై ప్రత్యేక నిఘా పెట్టారని అంబటి ఆరోపించారు. రాష్ట్రంలో ఏ చిన్న సంఘటన జరిగినా తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో అమరావతి వెళ్లినప్పుడు, అలాగే రాజమండ్రి జైలు నుంచి బయటకు వస్తున్నప్పుడు కూడా తనపై అక్రమ కేసులు పెట్టారని గుర్తుచేశారు. తనపై వంద కేసులు పెట్టుకున్నా భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. "తాను కాపుల ప్రతినిధిని కానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా చెప్పుకున్నప్పుడు, ఆయన ఇంకా కూటమిలో ఎందుకు కొనసాగుతున్నారు?" అని అంబటి ప్రశ్నించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల కాపు సామాజికవర్గంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు.

# రాయలసీమ కరవుకు గోదావరి జలాలే శాశ్వత పరిష్కారం: సత్యకుమార్ యాదవ్



అమరావతి,: రాయలసీమ ప్రాంతంలో దశాబ్దాలుగా వేధిస్తున్న కరవు రక్కసిని తరిమికొట్టేందుకు గోదావరి జలాల తరలింపే శాశ్వత పరిష్కారమని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ భారీ ఆర్థిక మద్దతు ఇస్తోందని ఆయన కొనియాడారు. ఈరోజు జరిగిన పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర సందర్భంగా.. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 20,700 కోట్లను విడుదల చేసిందని సత్యకుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి మరో రూ. 30 వేల కోట్లు ఇచ్చేందుకు కూడా కేంద్రం అంగీకరించిందని వెల్లడించారు. ఈ సందర్శన యాత్ర ద్వారా ప్రాజెక్టులోని లోటుపాట్లను గుర్తించి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. వైసీపీ అధినేత జగన్ గత ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అయినప్పటికీ ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించిన 80 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన వివరించారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా రాబోయే పది రోజుల్లోనే నీటిని విడుదల చేస్తామని పీవీఎన్ మాధవ్ ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమను సైతం సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులను శరవేగంగా పరుగులు పెట్టించేందుకు సిద్ధమవుతోంది.

# జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా ఉండాలి

అమరావతి,: పవిత్రమైన పూరీ జగన్నాథుని రథయాత్రను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా, శాంతిసంతోషాలతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ఒక భక్తిపూర్వక సందేశాన్ని పంచుకున్నారు. పవిత్రమైన ఈ రథయాత్ర అనేది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని.. అది అచంచలమైన విశ్వాసానికి, భక్తికి, అలాగే భగవంతునికి, భక్తుడికి మధ్య ఉండే శాశ్వతమైన ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీక అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. పవిత్ర రథాలపై స్వామివారు, అమ్మవారు ముందుకు సాగుతుండగా... ఆ జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవిల దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరి హృదయానికి శాంతిని, ప్రతి కుటుంబానికి మానసిక బలాన్ని, ప్రతి జీవితానికి సరికొత్త ఆశను ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆ కలియుగ దైవం మనందరినీ ఎల్లప్పుడూ ధర్మమార్గంలో నడిపించి, మన ఇళ్లను సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో నింపాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. దీనితో పాటు, సమాజానికి వినమ్రతతో, నిష్కల్మషమైన భక్తితో సేవ చేసేలా.. మనందరికీ అవసరమైన జ్ఞానాన్ని, ధైర్యాన్ని ఆ స్వామి ప్రసాదించాలని కోరారు. ఈ పవిత్రమైన రోజున జగన్నాథుని దివ్య అనుగ్రహం మన జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపి, శాంతి, ఐక్యత, ఆధ్యాత్మిక బలంతో కూడిన ఒక ఉన్నతమైన భవిష్యత్తు వైపు మన సమాజాన్ని నడిపించాలని ఆకాంక్షించారు.

# పీపీపీతోనే వేగంగా అభివృద్ధి.. 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి

మొదటి పేజి తరువాయి

పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలోనే 'ఆంధ్రప్రదేశ్ పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'ను కేబినెట్ ముందుకు తీసుకురావాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పర్యాటకం సహా వివిధ రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో పురోగతిలో ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. పీపీపీ కింద చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణ విధానాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని, ఈ ప్రాజెక్టులకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని తెలిపారు. అలాగే, విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు కేంద్రం రూ.178 కోట్ల వీజీఎఫ్ అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రతీ ప్రాజెక్టును ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టులలో స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేసి వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని బస్టాండ్ల వద్ద ఉన్న భూములను వాణిజ్యపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఫైనాన్షియల్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. బలహీన వర్గాల విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు, రెసిడెన్షియల్ హాస్టళ్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'జగన్ 2.0 సూపర్ యాప్' ఆవిష్కరణ

మొదటి పేజి తరువాయి



సోషల్ మీడియాలో మన వాళ్లు పోస్ట్ చేసిన కంటెంట్‌ను ఇష్టం వచ్చినట్లుగా డిలీట్ చేయడం, అందుకోసం ఇష్టానుసారం కుట్రలు పన్నడం.. ఇవన్నీ జరుగుతున్న నేపథ్యంలో మనమే ఒక యాప్ తీసుకొచ్చి ఒక ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేస్తున్నాం. అదే జగన్ 2.0 సూపర్ యాప్. దీంట్లో ప్రతి కార్యకర్త నిర్భయంగా తన అభిప్రాయం చెప్పొచ్చు. ..అంతే కాకుండా దీని ద్వారా ప్రతి కార్యకర్త పార్టీతో అనుసంధానమై ఉంటాడు. ఇది మన యాప్ కాబట్టి, మన వాళ్లే ఇందులోకి వస్తారు కాబట్టి, ఎవరు పడితే వారు డిలీట్ చేసే హక్కు కూడా వారికి ఉండదు. ఇది ఒక మంచి పరిణామం. ఇష్టం వచ్చినట్లు చేసే కుట్రలు కూడా దీనివల్ల తిప్పి కొట్టొచ్చు." అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఇంకా పార్టీలో ఉన్న చిన్న కార్యకర్త మొదలు, పార్టీ కేంద్ర కార్యాలయం వరకు.. నియోజకవర్గస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నాయకుడితో, ప్రతి కార్యకర్త అనుసంధానమై ఉంటాడు. ఎందుకంటే పార్టీలో ప్రతి ఒక్కరికి ఇది అందుబాటులో ఉంటుంది కాబట్టి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కానీ, పోలీసుల వేధింపుల వల్ల కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు కానీ, పార్టీకి సంబంధించిన ఏ అంశంపై కానీ, ఈ యాప్ ద్వారా నేరుగా ఒకరితో ఒకరు అనుసంధానమై టచ్‌లో ఉండే అవకాశం ఉంటుంది. ఈ యాప్‌లో మరో మంచి అంశం ఏమిటంటే, పార్టీలో మనం నిర్వహించే ప్రతి సమావేశం, ప్రెస్‌మీట్లు, ముఖ్యమైన కార్యక్రమాలు, ప్రకటనలు.. అన్నీ కూడా ఈ యాప్‌లో లైవ్ ఫీడ్ ద్వారా ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటుంది. భవిష్యత్తులో ఈ యాప్‌ను ఇంకా అభివృద్ధి చేయడం జరుగుతుంది. కార్యకర్తలు ఎక్కడైనా, ఏమైనా ఇబ్బంది పడుతుంటే వాటిని ఈ యాప్‌లో పోస్ట్ చేయడం, ఆ తర్వాత పార్టీ వాటిపై స్పందించడం, నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఆ కార్యకర్తకు అండగా నిలబడే అవకాశం కూడా ఉంటుంది. ..పోలీసుల వేధింపులతో ఇబ్బంది పడుతున్న మన పార్టీ వారు, ఇంకా రాజకీయ వేధింపులకు కూడా గురవుతున్న వారు ఇప్పుడు డిజిటల్ డైరీలో నమోదు చేస్తున్న వివరాలు.. ఆ డైరీ కూడా ఈ యాప్‌తో అనుసంధానం అవుతుంది. అంటే ఈ యాప్‌లో ఆ డిజిటల్ డైరీ కూడా అందుబాటులోకి వస్తుంది. దాని వల్ల వేధింపుల, సమస్యలు ఎదుర్కొంటున్న వారు నేరుగా ఈ యాప్ ద్వారా డిజిటల్ డైరీలో వాటిని ఫిర్యాదు చేయొచ్చు. ఆ వివరాలు నమోదు చేయొచ్చు. ..ఇతర సోషల్ మీడియా వేదికల్లో మనపై చేస్తున్న అనుచిత విమర్శలు, వీడియోలు, వ్యాఖ్యలపై ఫిర్యాదు చేసి, వాటిని తొలగింపచేసే ప్రయత్నం ఒకవైపు చేస్తూనే, మరోవైపు ఈ సూపర్‌యాప్‌ను ఎవరూ ఆపలేని విధంగా మనకు మనం సొంతంగా రూపొందించుకోవడం జరిగింది. ఈ యాప్ వల్ల ప్రతి కార్యకర్త నిత్యం, పార్టీ నాయకత్వంతో అనుసంధానమై ఉంటాడు" అని వైఎస్ జగన్ వివరించారు.

# పూరీ జగన్నాథుడి రథయాత్రలో అపశ్రుతి... ఒకరి మృతి

ఒడిశా: ఒడిశాలోని పూరీలో గురువారం జరిగిన జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీ కారణంగా ఏర్పడిన తొక్కిసలాట లాంటి పరిస్థితుల్లో ఊపిరాడక ఒకరు మరణించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, పూరీలోని మారిచికుండ్ కూడలి వద్ద ఈ దుర్ఘటన జరిగింది. భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన తాళ్ల బారికేడ్ కూలిపోవడం లేదా కొందరు భక్తులు పట్టుతప్పి కింద పడిపోవడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. సుమారు 40 నుంచి 50 మంది ఒకేచోట పడిపోవడంతో పలువురు గాయపడ్డారు. వారిలో నలుగురైదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వెంటనే స్పందించి సుమారు 20 మందిని రక్షించి అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ ఒక వృద్ధుడు మరణించినట్లు తెలిసిందని వారు పేర్కొన్నారు. భారీ జనసందోహం, కుండపోత వర్షం కారణంగా ఊపిరాడక, ఇతర గాయాలతో సుమారు 200 మంది భక్తులు పూరీలోని ఆసుపత్రులలో, తాత్కాలిక వైద్య శిబిరాల్లో చేరినట్లు సమాచారం. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు, గురువారం ఉదయం షెడ్యూల్ కంటే ముందుగానే పహండీ బిజే క్రతువుతో రథయాత్ర ప్రారంభమైంది. అయితే, ఊరేగింపు పూర్తికావడానికి మాత్రం రెండు గంటలకు పైగా ఆలస్యమైంది.

# సొంత పార్టీ నేతపై వేటు.. అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్

తమిళనాడు : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పాలనా దృక్పథం ఏంటో మరోసారి చూపించారు. అవినీతి, అధికార దుర్వినియోగంపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావులేదని... తప్పు చేసిన వారికి రెండో అవకాశం ఉండే ప్రసక్తే లేదని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పూర్తి పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. సొంత పార్టీ నేతపైనే వేటు: ఇటీవల తమిళనాడు వెల్ఫేర్ అసోసియేషన్ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా జాయింట్ సెక్రటరీ వీరాస్వామి (టీవీకే పార్టీ) లంచం తీసుకుంటున్నట్లు ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీనిపై తీవ్ర రాజకీయ విమర్శలు రావడంతో... విజయ్ ఏమాత్రం ఉపేక్షించకుండా ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవుల నుంచి తక్షణమే తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అనంతరం పోలీసులు కూడా వీరాస్వామిని అరెస్ట్ చేశారు. ఇటీవల కరూర్‌లో జరిగిన ప్రజాసభలో విజయ్ మాట్లాడుతూ ప్రజలకు కొండంత భరోసా ఇచ్చారు. "ఎవరైనా లంచం అడిగితే నిర్భయంగా 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెనుక నేను ఉంటాను. ఒకవేళ ఇంకా ఒత్తిడి చేస్తే... ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మా వెన్నంటి ఉన్నాడని ధైర్యంగా చెప్పండి" అంటూ ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజా ప్రభుత్వంలో అవినీతిని కూకటివేళ్లతో నిర్మూలించడానికి తాము కట్టుబడి ఉన్నామని... ప్రజల సహకారంతోనే ఈ మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సొంత పార్టీ కీలక నేతపైనే కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా... అవినీతి విషయంలో తాను ఎంత కఠినంగా ఉంటానో విజయ్ చెప్పకనే చెప్పినట్లయింది.

## ఎన్ ఐ టి లోసీటు సాధించిన చరణ్ ను అభినందించిన బీజేపీ రాంచంద్రారెడ్డి.



అయిజ (శివసూర్య )జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చెందిన మహా న్యూస్ రిపోర్టర్ యల్.తులసిరామ్ లక్ష్మి బాయి కుమారుడు,యల్.చరణ్ ఎన్.ఐ.టీ ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీ లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ సీటు సాధించడం పట్ల జోగులాంబ గద్వాల జిల్లా బిజెపి నాయకులు రామచంద్రారెడ్డి, ధూప దీప నై విద్య రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి ఆచార్యులు, జనం సాక్షి రిపోర్టర్ అమరేష్ శుభాకాంక్షలు తెలిపారు. చేనేత కార్మిక కుటుంబం నుండి వచ్చిన చరణ్ ఎన్.ఐ.టి లో సీటు సాధించటం తమ కుటుంబానికి ఎంతో గర్వ కారణం అని,తమ కుమారుడు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కిందని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు ఉపాధ్యాయులు రాజకీయ నాయకులు, ఎన్ఐటిలో సీటు సాధించడం పట్ల, ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## శ్రీ భక్త కనకదాస విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి టీడీపీ సీనియర్ నాయకులు ఈబీజీ గోవింద్ గౌడ్ గారికి ఆహ్వానం



హొళగుందశివసూర్య న్యూస్ జులై 16:మండలంలోని మధాసి మాదారి కురువ సంఘం నాయకులు, ఈ నెల 19-07-2026 (ఆదివారం) జరగనున్న శ్రీ భక్త కనకదాస విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు ఈబీజీ గోవింద్ గౌడ్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, సమాజ సేవలో ముందుండి ప్రతి వర్గానికి అండగా నిలుస్తూ ప్రజల అభిమానం పొందుతున్న ఈబీజీ గోవింద్ గౌడ్ గారు కార్యక్రమానికి రావలసింధి గా కోరారు. అందుకు స్పందించిన ఈబీజీ గోవింద్ గౌడ్ గారు ఆహ్వానానికి కృతజ్ఞతలు తెలుపుతూ, కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు.ఈ ఆహ్వాన కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు దర్గాన గారు, బోజప్ప గారు, రామలింగ పూజారి గారు, నల్లారెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు.

## లోక కళ్యాణార్థం వికాస తరంగిణి ఆధ్వర్యంలో పెద్దదిన్నెలో వరుణ యాగం అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి




గద్వాల్,శివసూర్య, జూలై 16: జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద దిన్నె గ్రామంలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో లోక కళ్యాణార్థం, సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో ఈనెల 18వ తేదీన పెద్దదిన్నె గ్రామంలో విశ్వహిందూ పరిషత్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఘనంగా వరుణ యాగం నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.ఈ మహాయజ్ఞం త్రిదండి చిన్న జీయర్ స్వామివారి మంగళాశాసనాలతో, ఆలయ చైర్మన్, వ్యవస్థాపక అధ్యక్షులు జయసింహారెడ్డి ఆధ్వర్యంలో రైతుల సంక్షేమం, సమృద్ధిగా వర్షాలు కురవడం, ప్రజల ఆయురారోగ్య ఐశ్వర్యాల కోసం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి.డి.ఎన్.ఎస్ జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, వేద పండితులు, అర్చకులు పాల్గొని వేదోక్తంగా, శాస్త్రోక్తంగా యాగాన్ని నిర్వహించనున్నట్లు వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.అలాగే ఈ పుణ్యకార్యక్రమానికి భక్తులు, రైతులు, హిందూ సమాజ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని యాగాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వరుణయాగం నిర్వహించిన జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు




గద్వాల, శివసూర్య, జూలై 16 : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ సమీపంలోని శ్రీ గురు ఓంకార పీఠం, శ్రీలేఖ కిరాణా వద్ద గల స్థలదేవత తాయమ్మ అవ్వ దేవాలయ ప్రాంగణంలో లోక కళ్యాణార్థం, రైతుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా వరుణయాగం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని డి.డి.ఎన్.ఎస్ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు ఆధ్వర్యంలో వారి బృందం వేదోక్తంగా నిర్వహించింది.ఈ సందర్భంగా ఆచార్య చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, రైతులు సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాలు కలగాలని సంకల్పంతో ఈ వరుణయాగాన్ని ప్రతిరోజు సుందరకాండ దేవి పురాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఉప్పల గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను సందర్శించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య, జూలై 16: జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం ఉప్పల గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను తెలంగాణ రాష్ట్ర దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు సందర్శించారు.ఉప్పల గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న సందర్భంగా, వారి ఆహ్వానం మేరకు ఆలయాన్ని సందర్శించిన చక్రవర్తి చార్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలను అభినందించిన ఆయన, భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తై మహా కుంభాభిషేకం వైభవంగా జరగాలని ఆకాంక్షించారు.అలాగే శ్రీ ఆంజనేయస్వామి అనుగ్రహంతో ఉప్పల గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండుతూ గ్రామ ప్రజలందరూ సుఖశాంతులు, ఐశ్వర్యాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించారు. ఆలయాల పరిరక్షణ ప్రతి హిందువు బాధ్యత అని పేర్కొంటూ, ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని చక్రవర్తి చార్యులు పిలుపునిచ్చారు.

## అర్చక సంఘం పెద్దలు రంగస్వామిని ఘనంగా సత్కరించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య, జూలై 16:జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం రాజాపురం గ్రామంలోని శ్రీ రంగనాథస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు, అర్చక సంఘం సీనియర్ నాయకులు పులికంటి రంగస్వామి గారిని తెలంగాణ రాష్ట్ర దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి చార్యులు ఘనంగా సత్కరించారు.పులికంటి రంగస్వామి గారు అర్చక సమాజ అభ్యున్నతి కోసం, దేవాలయ సేవల అభివృద్ధికి, అర్చకుల సంక్షేమం కోసం ఎన్నో సంవత్సరాలుగా అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, అర్చక సంఘం బలోపేతానికి రంగస్వామి గారి అనుభవం, మార్గదర్శకత్వం ఎంతో అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సంఘ అభివృద్ధికి తమ విలువైన సలహాలు, సూచనలు అందిస్తూ అర్చకుల ఐక్యతకు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అర్చక సంఘం నాయకులు, మాండొడ్డి తదితరులు, స్థానిక అర్చకులు, భక్తులు పాల్గొని రంగస్వామి గారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పంటల బీమాను ప్రభుత్వమే భరించాలి.

మంత్రాలయం నియోజకవర్గం. అన్నదాతల పై భారం వేయడం సరికాదు..... మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి.మంత్రాలయం:ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో వర్షభావం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అన్నదాతలు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం రైతులు వెంటనే పంటల వారీగా నిర్ణయించిన పంటల బీమా నగదు చెల్లించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించిందని అయితే ఇప్పటికే రైతులు పెట్టుబడులు పెట్టి పూర్తిగా ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి తరుణంలో బీమా నగదు చెల్లించాలని అన్నదాతల పై భారం వేయడం సరికాదని అన్నారు.గత ప్రభుత్వం వైస్సార్ కాంగ్రెస్ పార్టీలో కరోనా కష్టాలు ఉన్నప్పటికీ రైతులు సాగు చేసిన పంటలకు ప్రభుత్వమే బీమా చేయించేదని గుర్తు చేశారు. రైతుల పక్షాన పోరాడే పార్టీ ఏదైనా ఉందంటే అది వైఎస్సార్సీపి పార్టీయేనన్నారు. అన్నదాతలకు అండగా ఉంటామని చెప్పిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఇలాంటి భారం మోపడం సరికాదని హెచ్చరించారు... ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గత ప్రభుత్వంలో మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా పంటల బీమా రైతులతో కాకుండా ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## గ్రామాల్లో మౌలిక వసతులకు కృషి చేయాలి. గూడూరు ఎంపీపీ గురవయ్య

గూడూరు -):గూడూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గురవయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గురవయ్య మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతుందని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మధుసూదన్ రావు, జడ్పీటిసి ఊటుకూరు యామిని , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లోకేష్ యాదవ్ జన్మదిన వేడుకలు

గూడూరు - ):ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ సేవా సంస్థ అధ్యక్షులు , అనేక స్వచ్ఛంద సేవా సంస్థలకు దాతగా వ్యవహరించే మయూరి శ్యామ్ యాదవ్ కుమారుడు లోకేష్ యాదవ్ జన్మదినం సందర్భంగా గవర్నమెంట్ హాస్పిటల్ కు ఐదు కుర్చీలు, ఓం శ్రీ సాయి రాం వృద్ధఆశ్రమంలో అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ తన కుమారుడు జన్మదినం సందర్భంగా ప్రగతి సేవా సంస్థ ద్వారా ఈ కార్యక్రమాలు చేయడం ఎంతో ఆనందంగా ఉన్నదని తను వ్యక్తిగతంగా నిర్వహించే సంస్థల ద్వారా మరియు ఇతర సేవా సంస్థల ద్వారా సమాజానికి అవసరమైన సేవ చేయడం తనకెంతో ఆనందాన్నిస్తుందని తెలిపారు. ఈ అవకాశం ఇచ్చిన శ్రీకృష్ణ పరమాత్మునికి నమస్కరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు మయూరి శ్యామ్ యాదవ్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు కార్యవర్గ సభ్యులు టీచర్ మామడూరు రాదయ్య, వాచ్ షాపు రాము, కుమార్ నాయుడు, కోట వెంకటేశ్వర్లు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అదనపు తరగతులు తప్పనిసరి

ధర్మవరం, జూలై 16; : ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అదనపు తరగతులు తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈఓలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ ఆదేశించారు. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ సూచనల మేరకు జూలై 13 నుంచి నవంబర్ 30 వరకు యాక్షన్ ప్లాన్ ప్రకారం తరగతులు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించి బోధన అందించడంతో పాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 2026-27 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, హెడ్మాస్టర్లు పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. జిల్లా కలెక్టర్, డీఈఓతో పాటు ఇతర అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు.

## ఇజెతిమా నిర్వహణకు సహకారం అందించాలి

ధర్మవరం, జూలై 16; నవంబరులో ధర్మవరంలో జరగనున్న ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి ఇజితిమా (ధార్మిక సమ్మేళనం) విజయవంతానికి అవసరమైన సహకారం అందించాలని ముస్లిం మతపెద్దలు మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబును కోరారు. ఎన్డీయే కార్యాలయంలో జరిగిన సమావేశంలో ధర్మవరం, కదిరి ప్రాంతాలకు చెందిన మతపెద్దలు ఇజితిమా ఏర్పాట్లపై వివరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ధార్మిక సమ్మేళనానికి వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. వినతికి స్పందించిన హరీష్ బాబు, అన్ని మతాల ధార్మిక కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి సత్యకుమార్ యాదవ్ పూర్తి సహకారం అందిస్తారని, కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## తాళం వేసిన ఇంటికి పోలీసుల భరోసా.. ఎల్‌హెచ్‌ఎంఎస్ తో భద్రత

ధర్మవరం, జూలై 16; ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే వారి ఆస్తుల భద్రత కోసం శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు అమలు చేస్తున్న లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ప్రజాదరణ పొందుతోందని వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ప్రజలు ముందస్తుగా పోలీసులకు సమాచారం అందిస్తే, ఆ ఇళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తామని చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ప్రజలు ఈ సేవను వినియోగించుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.

## నేత్రదానంతో ఇద్దరికి చూపు.. జింకా రామచంద్ర కు ఘన నివాళి

ధర్మవరం, జూలై 16; : పట్టణంలోని శారదానగర్‌కు చెందిన జింకా రామచంద్ర గుండెపోటుతో మృతి చెందగా, గురువారం ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించి ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపారు. విశ్వదీప సేవా సంఘం అవగాహన కల్పించడంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అనంతపురం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టెక్నీషియన్ జి. రాఘవేంద్ర కార్నియాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన దాత కుటుంబ సభ్యులను విశ్వదీప సేవా సంఘం అభినందించింది. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు. నేత్రదానం చేయాలనుకునే వారు సేవా సంఘం ప్రతినిధులను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## గాయపడిన దూడకు చికిత్స అందించి మానవత చాటిన సేవా సంస్థ సభ్యులు

ధర్మవరం, జూలై 16;పట్టణంలోని కాయగూరల మార్కెట్ సమీపంలోని చర్చి వద్ద కాలికి తీవ్ర గాయంతో లేవలేని స్థితిలో ఉన్న ఆవు దూడకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సకాలంలో చికిత్స అందించి మానవతను చాటుకున్నారు. సమాచారం అందుకున్న సంస్థ ప్రమోటర్ గ్రూప్ సభ్యుడు పళ్లెం జనార్ధన, కోశాధికారి చల్లా చంద్రశేఖర్ దూడను ప్రభుత్వ పశువైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. అనంతరం దూడను తిరిగి ఆవు వద్దకు చేర్చారు. సేవా సంస్థ సభ్యుల సేవాభావాన్ని స్థానికులు అభినందించారు.

## ప్రత్యేక విద్యుత్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి - డీ. ఈ. ఈ లక్ష్మీ నరసింహారెడ్డి

ధర్మవరం, జూలై 16; విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం జూలై 17న బత్తలపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ సెక్షన్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ డీఈఈ లక్ష్మీనరసింహారెడ్డి తెలిపారు. పుట్టపర్తి డివిజన్ ఈఈ శివరాములు ఆదేశాల మేరకు నిర్వహించే ఈ అదాలత్‌లో బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం, ధర్మవరం రూరల్ మండలాలకు చెందిన వినియోగదారులు పాల్గొనవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సంబంధిత సమస్యలను రాతపూర్వకంగా తెలియజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహణ

ధర్మవరం, జూలై 16; పట్టణంలోనిచక్కటి కంటిచూపు ప్రతి ఒక్కరి జీవితానికి వెలుగునిస్తుందని ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప అన్నారు. గురువారం మండలంలోని గొట్లూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 131 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో నలుగురు విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించి, త్వరలో ప్రభుత్వ ఆధ్వర్యంలో అద్దాలు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులకు కంటి సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, మలేరియా అసిస్టెంట్ ఆంజనేయులు, ఏఎన్ఎం నీరజ, హెడ్మాస్టర్ జగన్నాథం, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చింతలపల్లి ఆంజనేయస్వామి గుడి మాన్యం భూములపై సమీక్ష

ధర్మవరం, జూలై 16; ) ధర్మవరం రూరల్ మండలంలోని చింతలపల్లి శ్రీ ఆంజనేయస్వామి గుడి మాన్యం భూముల అంశంపై నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి మహేష్ చౌదరి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామ ప్రజలు, నాయకులతో భూముల పరిరక్షణ, తదుపరి చర్యలపై చర్చించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల సమస్యలను నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని మహేష్ చౌదరి హామీ ఇచ్చారు.

## పంటల బీమా ప్రీమియం భారం రైతులపై మోపడం దారుణం..! - వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.ఆర్. మురహరి రెడ్డి

- ఎమ్మిగనూరు(కర్నూలు)-రాష్ట్రంలోని రైతులపై పంటల బీమా ప్రీమియం పేరుతో అదనపు ఆర్థిక భారం మోపడం దారుణమని వైఎస్సార్సీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు కె.ఆర్. మురహరి రెడ్డి తీవ్రంగా ఖండించారు. రైతులకు రక్షణగా ఉండాల్సిన బీమా పథకాన్ని వారికి భారంగా మార్చడం ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమని విమర్శించారు. 2019 నుండి 2024 వరకు వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రైతులపై ఒక్క రూపాయి భారం పడకుండా, పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే పూర్తిస్థాయిలో భరించిందని, రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన ఆ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల నుంచి ప్రీమియం వసూలు చేస్తూ వారి నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, సాగు ఖర్చులు విపరీతంగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలు లేక అప్పుల ఊబిలో ఉన్న రైతులు ఎకరాకు వేల రూపాయల చొప్పున ప్రీమియం ఎలా చెల్లించగలరని, రైతు జేబులో చేయి పెట్టి డబ్బులు వసూలు చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు ప్రభుత్వం ఇచ్చిన గడువు చాలా తక్కువగా ఉండటం వల్ల వేలాది మంది రైతులు ప్రీమియం చెల్లించలేకపోయారన్నారు. తగిన ప్రచారం చేయకుండా గడువు ముగిసేలా చేసి నెట్ సెంటర్ల వద్ద రైతులు, మహిళలు గంటల తరబడి క్యూల్లో నిలబడేలా చేయడం ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని దుయ్యబట్టారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, ప్రభుత్వం వెంటనే పంటల బీమా ప్రీమియం వసూళ్లను నిలిపివేసి, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రీమియం మొత్తాన్ని పూర్తిగా భరించాలని, రైతులకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.

## అనంతపురం జిల్లా జాప్ అధ్యక్షుడిగా సి.పి. వేణుగోపాల్ రెడ్డి నియామకం

అనంతపురం, జూలై 16: జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ బ్యూరో ప్రతినిధి సి.పి. వేణుగోపాల్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాప్ రాష్ట్ర అధ్యక్షుడు పున్నంరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుగంధర్ రెడ్డి గురువారం నియామకపత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సి.పి. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, అనంతపురం జిల్లాలో జాప్‌ను మరింత బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పాత్రికేయుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు.ఈ నియామకంపై పలువురు పాత్రికేయులు, జాప్ నాయకులు వేణుగోపాల్ రెడ్డికి అభినందనలు తెలియజేసి, ఆయన నాయకత్వంలో జిల్లా స్థాయిలో జాప్ మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## కేసుల ఛేదనలో దూసుకెళ్తున్న ఇబ్రహీంపట్నం బి క్రైమ్ డిపార్ట్మెంట్ కి పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ప్రశంసలు ఇబ్రహీంపట్నం స్థానికుల అభినందనలు

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం జులై 16 ఇబ్రహీంపట్నం పోలీసులు కేసుల ఛేదనలో తమదైన శైలిలో వేగవంతంగా దూసుకెళుతున్నారు. క్లిష్టమైన కీలక కేసులను సైతం వేగంగా ఛేదించి అందరి ప్రశంసలు పొందుతున్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నంలో సంచలనం కలిగించిన దొంగ నోట్ల కేసులో పోలీసుల పనితీరు ప్రశంసనీయం. దొంగ నోట్ల పట్టుకోవడమే కాకుండా సూత్రధారులను, మూలాలను సేదించారు. గుంటుపల్లి లో జరిగిన గుడి దొంగతనం కేసులో తక్కువ సమయంలో దొంగలను పట్టుకొని మొత్తం చోరీ అయిన సామాన్లను రికవరీ చేసి మరోసారి తమ పనితనం చూపించారు. ఈ మొత్తం వ్యవహారంలో క్రైమ్ డిపార్ట్మెంట్ పనితీరు అత్యంత ప్రశంసనీయం.

## జార్జిపేటలో సూర్య ఘర్ సోలార్ ప్యానెల్స్‌కు క్షేత్రస్థాయితనిఖీ.పరిశీలించిన చింతలపూడి ఎలక్ట్రికల్ ఏడి రాంబాబు

ఏలూరు జిల్లా,చింతలపూడి ,జులై 16 )ఏలూరు జిల్లా చింతలపూడి మండలం జార్జిపేట గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సూర్య ఘర్ సోలార్ పథకం కింద ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్‌ను చింతలపూడి ఎలక్ట్రికల్ ఏడి రాంబాబు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.సోలార్ ప్యానెల్స్ పనితీరు, విద్యుత్ ఉత్పత్తి, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి, పథకం ద్వారా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యుత్ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు సూర్య ఘర్ పథకం ప్రయోజనాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ తనిఖీలో విద్యుత్ శాఖ లైన్మెన్ రెడ్డి నాయక్ పాల్గొన్నారు.

## మున్సిపల్ శాఖ పని తీరుపై ఎమ్మెల్యే రోషన్ కుమార్ సమీక్ష

ఏలూరు జిల్లా ,జంగారెడ్డిగూడెం ,జులై 16 (జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ లోని వివిధ శాఖల పనితీరుపై చింతలపూడి శాసనసభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం,పన్నుల వసూలు తీరు, ఇతర ఆదాయం వనరులు ప్రభుత్వానికి సమకూర్చడం, పారిశుధ్యం, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ విభాగం, పట్టణ ప్రణాళికా విభాగం, జనన,మరణాలు తదితర విభాగాల ప్రభుత్వం ప నితీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. మెప్మా పట్టణ పేదరిక నిర్మూలన పథకం ద్వారా 52 గ్రూపులకు 9.50 కోట్ల రూపాయల ఆర్థిక చేయూత అందించడం జరిగిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఆర్థిక చేయూత లక్ష్యసాధన గా ముందుకు సాగాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అధికారులకు సూచించారు.

## మర్యాదపూర్వకంగా కలిసిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు జిల్లా ,ఏలూరు ,జులై 16 రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి చంటి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బుధవారం

# కెజిబివి టీచర్లను రెగ్యులరైజ్ చేయాలి టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చుంచు శ్రీశైలం

గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూళ్ల టీచర్లకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి

మోడల్ స్కూళ్లను టిపిఎస్ లుగా మార్చడం ప్రచార ఆర్భాటానికే.



16 జూలై మహబూబాబాద్ అర్బన్ గత పద్నాలుగు ఏళ్లుగా విద్యా వ్యవస్థలో చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి, శ్రమదోపిడీకి గురవుతున్న కెజిబివి టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని,గురుకుల పాఠశాలల్లో,మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ



ఉపాధ్యాయులతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చుంచు శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆ సంఘం మహబూబాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో పాఠశాలల సందర్శన-సమస్యల సేకరణ కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల,మహాత్మ జ్యోతిబాపూలే,మోడల్ స్కూల్ అనంతారం పాఠశాలలలో జరిగిన సమావేశాలలో శ్రీశైలం మాట్లాడుతూ వివిధ రకాల మేనేజ్మెంట్ లలో పాఠశాలలను నెలకొల్పుతూ ఉపాధ్యాయులను విభజించి పాలించే విధానాలను అవలంభిస్తున్నారని ఆరోపించారు.విద్యను బలోపేతం చేసేందుకు సూచనలు ఇవ్వాలని విద్యా కమిషన్ ను కోరితే అది ఉన్న బడులను స్వయం మరణానికి పురిగొల్పే సిఫారసులు చేసిందని గుర్తుచేశారు.”అందరికీ విద్య-అందుబాటులో విద్య” అనే సార్వత్రిక సూత్రానికి వ్యతిరేకంగా ఉన్న విద్యా కమిషన్ సిఫారసులను పక్కకు పెట్టకుండా,వాటి అమలుకు పూనుకోవడం చట్టవ్యతిరేకమైన చర్య అవుతుందని అన్నారు.ఇరవై ఐదు ఎకరాల్లో యాభై రెండు రకాల సదుపాయాలతో సర్వహంగులతో టిపిఎస్ లను ఏర్పాటు చేస్తామన్నారని ఇంతలోనే మాట మార్చి మోడల్ స్కూళ్లను టిపిఎస్ లుగా మారుస్తామని ప్రకటిస్తున్నారని,ఇది ప్రచార ఆర్భాటం తప్ప ఇంకేమి కాదని విమర్శించారు. టిపిఎస్ ల నిర్మాణం నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని,ఇప్పటికే ఉన్న బడులలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి వాటిని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ మహ -బాద్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఘనపురం బిక్షపతి,సారెడ్డి రామలింగారెడ్డి, సీనియర్ నాయకులు సోమ విష్ణువర్ధన్,నేలపోగుల దుర్గయ్య, కోడూరి శ్రీనివాస్,గులగట్టు రఘు,దబ్బా నరేష్,బానోత్ మంగీలాల్,బి.సురేష్, భూక్య రమేష్,గుగ్గిళ్ళ నాగరాజు, కొంపెల్లి వినయ్ కుమార్ గారలు పాల్గొన్నారు.

# కట్టమైసమ్మకు కుమ్మరుల తొలి బోనం

మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో కలిసి పాల్గొన్న టీజీఆర్డీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి






ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మ ఆలయం వద్ద తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కుమ్మరుల తొలి బోనాల జాతర అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గారు, కొండా సురేఖ గార్లతో కలిసి తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి గారు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య గారు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు, కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి గారు తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.వందలాది మంది కుమ్మర మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని, పోతరాజుల విన్యాసాలు, బ్యాండ్ మేళాల నడుమ లోయర్ ట్యాంక్‌బండ్ మీదుగా కనకాల కట్టమైసమ్మ ఆలయం వరకు భారీ ర్యాలీగా చేరుకుని అమ్మవారికి తొలి బోనాన్ని సమర్పించారు. భక్తుల జయజయధ్వానాలు, సాంప్రదాయ కళారూపాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్తకుర్మ శివ కుమార్ గారు, రాచర్ల వెంకటేశ్వర్లు గారు, బబ్బూరి ఆనంద్ గౌడ్ గారు, ఏఎంసీ డైరెక్టర్ గణేష్ నాయక్ గారు, బేర బాలకిషన్ గారు, వెంకట్రామ్ రెడ్డి గారు, చంద్రశేఖర్ గారు, జానకిరామ్ నాయక్ గారు, కృష్ణ నాయక్ గారు, గోవర్ధన్ నాయక్ గారు, సిలివేరు యాదమ్మ గారు, మాధవి గారు, సరిత గారు, భాగ్య గారు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించుటకై ఉపాధ్యాయులందరూ కృషి చేయాలి

జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. సత్యనారాయణమూర్తి




16 జూలై మహబూబాబాద్ అర్బన్ మూడు రోజుల ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలలో భాగంగా జీవశాస్త్ర ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ హై స్కూల్ మహబూబాబాద్ లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిఇఓ ఏ సత్యనారాయణ మూర్తి గారు మాట్లాడుతూ ఇలాంటి శిక్షణల ద్వారా ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు అప్డేట్ అవుతూ కొత్త కొత్త టూల్స్ ని ఎలా ఉపయోగించాలి వాటి ద్వారా నాణ్యమైన బోధనను ఏ విధంగా అందించాలి తెలుసుకొని విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ ల్యాబ్లను, ఐ ఎఫ్ పి లను వినియోగిస్తూ విద్యార్థులచే కొత్త ఆవిష్కరణలను ఆవిష్కరించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ శిక్షణ అంశాలన్నింటినీ పాఠశాల స్థాయిలో అమలు చేసి విద్యార్థులలో ప్రమాణాలను పెంపొందించడం లో అందరూ విధిగా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఉపాధ్యాయులను కోరినారు ఇంకా ఈ కార్యక్రమంలో డీఎస్ఓ అప్పారావు కోర్స్ ఇంచార్జ్ వంగ సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం .కోటియా నాయక్, డిఆర్పీలు రామ్మోహన్, సునీత ,నవీన్ భాస్కర్ సిఆర్పిలు వీరన్న, నారాయణ మరియు వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# హుడా కాలనీలో మసీదు స్థలం కేటాయించాలీ

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు వినతి



శంషాబాద్ జోన్ 16 జూలైజీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని హుడా కాలనీలో గత 30 సంవత్సరాలుగా ముస్లిం, హిందూ, క్రైస్తవ సోదరులు సామరస్య వాతావరణంలో నివసిస్తున్నారు. అయితే, హుడా కాలనీలో ముస్లిం సోదరుల ప్రార్థనల కోసం ఇప్పటివరకు మసీదు లేకపోవడంతో, ముఖ్యంగా వృద్ధులు దూర ప్రాంతాలకు వెళ్లి నమాజ్ చేయాల్సిన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక ముస్లిం సోదరులు తెలిపారు.ఈ నేపథ్యంలో మసీదు నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ గారికి వినతి పత్రం సమర్పించారు. ఈ వినతికి ఎమ్మెల్యే సీనియర్ నాయకుడు శ్రీ తీగల శివకుమార్ ముదిరాజ్ బాయ్ బాయ్ అనేదానంతో ప్రతి ఒక్కరు అన్నదమ్ములుగా మెల్లగాలనే ఆలోచనతోమద్దతు తెలుపుతూ, ముస్లిం సోదరులతో కలిసి వారి విజ్ఞప్తిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.హుడా కాలనీలో ఇప్పటికే హిందూ సోదరుల కోసం హనుమాన్ మందిరం, క్రైస్తవ సోదరుల కోసం చర్చి అందుబాటులో ఉన్న నేపథ్యంలో, ముస్లిం సోదరుల ప్రార్థనల కోసం కూడా మసీదు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించి తగిన చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.ఈ కార్యక్రమంలో హుడా కాలనీకి చెందిన ముస్లిం యువకులు, పెద్దలు మరియు స్థానిక ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో కూడా కాలే మైనార్టీ సోదరులు పాల్గొన్నారు

# కమిటీకి చట్టబద్ధత కల్పించాలి.. సమీక్షల కోసం మీరే జిల్లాలకు రావాలి: మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ముఖాముఖిలో ఉద్యమకారుల డిమాండ్



హైదరాబాద్‌జూలై 16, 2026:తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ అధికారిక షెడ్యూల్ ప్రకారం నేడు అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) లో మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, మరియు కరీంనగర్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీ మోతె శోభన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, శ్రీ అద్దంకి దయాకర్, మరియు శ్రీ ఎస్. రాములు నాయక్ తదితరులు హాజరై ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనలో మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. సింగరేణి బొగ్గు గనుల సమ్మెల ద్వారా నాటి ప్రభుత్వ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మంచిర్యాల, ఆసిఫాబాద్ కార్మిక శ్రేణులు, ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా నిలిచిన కరీంనగర్ పోరాట గడ్డల త్యాగాలు చారిత్రాత్మకమైనవని ప్యానల్ స్పష్టం చేసింది.నేటి ముఖాముఖి సంప్రదింపుల్లో పాల్గొన్న అత్యధిక శాతం మంది ఉద్యమకారులు సంక్షేమ పథకాల కంటే ముందే రెండు అత్యంత కీలకమైన డిమాండ్లను కమిటీ ముందు గట్టిగా లేవనెత్తారు:1. కమిటీకి చట్టబద్ధత కల్పించాలి : ప్రస్తుతం ఏర్పాటైన కమిటీ కేవలం దరఖాస్తుల పరిశీలనకే పరిమితం కాకుండా, దీనికి పూర్తి స్థాయి న్యాయపరమైన చట్టబద్ధత కల్పించాలని ఉద్యమకారులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ మార్పులు వచ్చినా ఉద్యమకారుల హక్కులకు భంగం కలగకుండా ఈ చట్టబద్ధత అత్యవసరమని పేర్కొన్నారు.2. కమిటీ సభ్యులు జిల్లాలకే రావాలి : సుదూర ప్రాంతాలైన ఆసిఫాబాద్, మంచిర్యాల వంటి సరిహద్దు జిల్లాల నుండి వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఉద్యమకారులు హైదరాబాద్ దాకా రాలేకపోతున్నారని ప్రతినిధులు కమిటీ దృష్టికి తెచ్చారు. అందువల్ల, కమిటీ సభ్యులే స్వయంగా జిల్లాలకు వచ్చి క్షేత్రస్థాయిలో ఉండి నిజమైన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను చేపట్టాలని పట్టుబట్టారు.ఈ రెండు ప్రధాన డిమాండ్లతో పాటు, క్షేత్రస్థాయి యోధులు తమ ఇతర ఆత్మగౌరవ సంక్షేమ వినతులను కూడా కమిటీకి సమర్పించారు. అందులో భాగంగా: అర్హులైన ప్రతి కుటుంబానికి 250 గజాల నివాస స్థలం కేటాయించాలని, జీవన భృతి కోసం గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్ అందించాలని, ఉద్యమకారుల పిల్లలకు విద్యా, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వీటితో పాటు మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక ప్రయోజనాలు, ఉచిత కార్పొరేట్ వైద్యం కోసం హెల్త్ కార్డులు, ఉచిత నాణ్యమైన విద్య, మరియు ఆర్టీసీ బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాల్సిందిగా వినతి పత్రాలు సమర్పించారు.

## కమిటీ సభ్యుల సానుకూల స్పందన:

ఉద్యమకారులు లేవనెత్తిన అంశాలపై కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు స్పందిస్తూ.. “మీ ప్రతిపాదనలు వందకు వంద శాతం న్యాయమైనవి. ఈ అంశాలను సమగ్ర నివేదికలో చేర్చి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి దృష్టికి తక్షణమే తీసుకెళ్తాం. ఐఅండ్‌పీఆర్ డిజిటల్ రికార్డింగ్ సాక్షిగా ప్రతి ఒక్క నిజమైన పోరాట యోధునికి వడ్డీతో సహా న్యాయం జరిగేలా చూస్తాం” అని గట్టి భరోసా ఇచ్చారు. జూలై 22 వరకు ఈ ముఖాముఖి షెడ్యూల్ నిరంతరాయంగా కొనసాగుతుందని కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు గారు ముగింపు ప్రసంగంలో స్పష్టం చేశారు. మీడియా సెల్, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీఈ ముఖాముఖి కార్యక్రమం లో చైర్మన్ గారితో పాటు సభ్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారు, శ్రీ ప్రొఫెసర్ కొండండ్ రామ్ గారు, శ్రీ మోతే శోభన్ రెడ్డి గారు, శ్రీ రాములు నాయక్ గారు పాల్గొన్నారు.అన్ని ప్రముఖ దినపత్రికలు, న్యూస్ ఛానళ్లు మరియు డిజిటల్ మీడియా మాధ్యమాలలో విస్తృత ప్రచురణ/ప్రసారం కొరకు.

# భద్రాచలంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి

మాలలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిద్దాం: దామల సత్యం



భద్రాచలం పట్టణంలో ఇటీవల మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన మాలల బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర గనులు కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి మాల సమాజానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ హైదరాబాద్‌లో క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించడం స్వాగతించదగ్గ పరిణామమని మాల మహానాడు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి దామల సత్యం పేర్కొన్నారు.భద్రాచలం సభలో మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, “మాల జాతి కోసం ఎంత దూరమైనా వస్తాను. అవసరమైతే మంత్రి పదవిని సైతం వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. నాకు పదవులు కాదు, మాల జాతి ముఖ్యం” అని ప్రకటించారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ అనంతరం రోస్టర్ విధానంలో మాల సామాజిక వర్గానికి జరిగిన నష్టాలను సరిదిద్దేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, మాలలకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తానని భద్రాచలం సభలో ఇచ్చిన హామీ మేరకు హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించడం హర్షణీయమన్నారు.హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు డాక్టర్ వివేక

# అక్కినపల్లి మల్లారం-- మూలమలుపు వద్ద ట్రాలీ బోల్తా.. పలువురికి గాయాలు

ట్రాలీ ప్రమాద బాధితులకు వెంటనే వైద్య సేవలు అందించిన మెడికల్ సూపర్డెంట్ గౌరీ ప్రసాద్

ట్రాలీ ప్రమాదం.. 22 మందికి సత్వర వైద్య సేవలు అందించిన ప్రభుత్వ ఆసుపత్రి




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు అరుణ ప్రభ:-అక్కినపల్లి మల్లారం--మూలమలుపు మార్గంలో కూలి పనులకు వెళ్తున్న కూలీలతో ప్రయాణిస్తున్న ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో పలువురు కూలీలు గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర సేవలైన



108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని 22 మంది క్షతగాత్రులను మణుగూరు ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రికి చేరుకున్న వెంటనే సూపరింటెండెంట్ డాక్టర్ ముత్తేనేని గౌరీ ప్రసాద్ స్వయంగా అత్యవసర విభాగానికి చేరుకుని వైద్య బృందాన్ని అప్రమత్తం చేశారు. గాయపడిన ప్రతి ఒక్కరికీ తక్షణ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందేలా దగ్గరుండి పర్యవేక్షించారు. 22 మంది క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. సూపర్డెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్ చొరవతో క్షతగాత్రులకు ఎలాంటి ఆలస్యం లేకుండా చికిత్స ప్రారంభమవడంతో వారి కుటుంబ సభ్యులు మెడికల్ సూపర్డెంట్ గౌరీ ప్రసాద్ కి ప్రశంసాలు కురిపించారు కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి బాధితులకు వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ఆసుపత్రుల సేవా దృక్పథానికి నిదర్శనమని పలువురు అభినందించారు.

# వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు తప్పనిసరి

జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయచంద్ర



16 జూలై మహబూబాబాద్ అర్బన్ మహబూబాబాద్ మండలం పర్వతగిరి రెవెన్యూ పరిధిలోని సొమ్లతండా గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచి ఆధ్వర్యంలో వర్షాభావ పరిస్థితులలో ప్రత్యామ్నాయ పంటలపై జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ విజయచంద్ర రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ మరియు నీటిపారుదల శాఖ అధికారులచే గ్రామస్థాయిలో నీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షపాతం ఆధారంగా వివిధ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణం వచ్చే మార్పులు ఎల్నినో నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరి పంట బదులు ప్రత్యామ్నాయ పంటలైన పెసర, మినుము, రాగి, కందులు, జొన్నలు ,కూరగాయలువంటి పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర తెలిపారు. వరికి బదులు ఆయిల్ ఫామ్, మల్బరీ ,నిమ్మగడ్డి వంటి అధిక ఆదాయాన్నిచ్చే పంటలను సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మా రెడ్డి తిరుపతిరెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈ కళ్యాణ్ ,ఏఈఓ షహనా బేగం, గ్రామ సర్పంచ్ సుజాత బాలాజీ నాయక్, రైతులు పాల్గొన్నారు.

# కాయగూరలు పండిద్దాం అత్యధిక ఆదాయం పొందుదాం స్వయం సహాయ సంఘాల ద్వారా పంట మార్పిడి ఎల్ నినో పరిస్థితుల్లో ఆరుతడి, కూరగాయల పంటల సాగు మేలు



మహబూబాబాద్ అర్బన్ జూలై.16గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఆరుతడి పంటలు, కూరగాయ పంటలు సాగు చేయాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు. మరియన్న రైతులకు అవగాహన కల్పించారుఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటల్లో, పండ్ల తోటల్లో అంతర పంటలు గా, ఎత్తు మడులు, పందిరి సాగు, ట్రెల్లిస్ సాగు, మల్చింగ్, బిందు సేద్య,సేంద్రీయ, ప్రకృతి సేద్యం మొదలైన మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు తెలిపినారు. రైతులు పంట మార్పిడి వైపు అడుగులు వేయాలని, ప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారుఈ అవగాహన కార్యక్రమంలో ఉద్యాన అధికారులు శాంతి ప్రియ, శాంతి ప్రియదర్శిని, ఫీల్డ్ అధికారి శ్రీకాంత్, కార్యాలయ సిబ్బంది జ్యోస్న, కిషోర్, కరుణాకర్,రామకృష్ణ, సుమతి,అరుణ, సుకన్య, రైతులు పాల్గొన్నారు

# సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి. జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా ప్రతి సైబర్ వారియర్ పనిచేయాలి.



ఎల్లారెడ్డి పేట న్యూస్.జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో నియమించబడిన సైబర్ వారియర్స్ సమర్థవంతంగా పనిచేయాలని అదనపు ఎస్పీ చంద్రయ్య తెలిపారు.జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు గురువారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్ సమీక్ష సమావేశం నిర్వహించి అదనపు ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు.ఈసందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్లో నియమించబడ్డ సైబర్ వారియర్స్ సైబర్ నేరాలపై వచ్చే పిర్యాదులపై తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయాలని, సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన వ్యక్తులు డబ్బు బ్యాంకులో ఫ్రీజ్ అయి ఉన్నట్లయితే వీలైనంత త్వరగా డబ్బులు తిరిగి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రతి పోలీస్ స్టేషన్లలో ఒక సైబర్ వారియర్స్ ని ఏర్పాటు చేయడం జరిగిందని,ప్రజలు సైబర్ నేరానికి గురైతే ఖంగారు పడకుండా వెంటనే 1930 ట్రోల్ ఫ్రీ నంబర్ కి కానీ, ఎన్ సి ఆర్ పి పోర్టల్ నందు కానీ, పోలీస్ స్టేషన్లో ఉన్న సైబర్ వారియర్ ని సంప్రదించాలన్నారు.ప్రతి సైబర్ వారియర్ తన పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, పెట్టుబడి మోసాలు తదితర సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.ఈసమావేశంలో సైబర్ ఆర్.ఎస్.ఐ జునైద్, సైబర్ వారియర్లు పాల్గొన్నారు.


# సే నో టు డ్రగ్స్..ఎస్ టు ఎ బిగ్ లైఫ్” పోస్టర్ ఆవిష్కరణ.




ఎల్లారెడ్డిపేట ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ మారుపాక హరీష్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మహేష్ బి.గి.తే ‘సే నో టు డ్రగ్స్ ఎస్ టు ఎ బిగ్ లైఫ్’ పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత డ్రగ్స్ కి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వారి యొక్క భవిష్యత్తుని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని, డ్రగ్స్ కి నో ,జీవితానికి ఎస్ చెప్పాలని యువతకు పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు యువత పైననే ఆధారపడి ఉంది కాబట్టి యువత మంచి మార్గంలో నడుస్తూ సమాజాన్ని మేల్కొల్పే విధంగా వారి యొక్క జీవన విధానం ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వేరో నెట్వర్క్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల మహేష్ గౌడ్,రాచర్ల గొల్లపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూత్ ప్రెసిడెంట్ లు గడ్డమీద సాయి చందు, అందే దేవచంద్రం, గుర్రాల రాజశేఖర్ రెడ్డి, జై భీమ్ యూత్ ప్రధాన కార్యదర్శి మిడిదొడ్డి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు

### ఆకాష్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన బి ఆర్ ఎస్ నాయకులు .



ఎల్లారెడ్డిపేట .మహారాష్ట్రలోని శ్రీరాంపూర్ పట్టణంలో ఇటీవల దారుణ హత్యకు గురైన జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్ గౌడ్ అల్లుడు ఆకాష్ గౌడ్ కుటుంబ సభ్యులను,గోవర్ధన్ గౌడ్ ను జిల్లా బి ఆర్ ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య తో పాటు పలువురు బి ఆర్ ఎస్ నాయకులు రాజన్న సిరిసిల్ల జిల్లా జై గౌడ ఉద్యమా అధ్యక్షుడు పందిర్ల లింగం గౌడ్,మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్ గౌడ్ ,మండల గౌడ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కోల నారాయణ గౌడ్,ఎల్లారెడ్డిపేట గౌడ సంఘం అధ్యక్షుడు గంట దేవ గౌడ్ లతో పాటు పలువురు గౌడ సంఘం నేతలు పరామర్శించారు.ఆకాష్ గౌడ్ చిత్ర పటానికి పూలు వేసి నివాళులు అర్పించారు.ఆకాష్ గౌడ్ హత్య పట్ల వారు విచారం వ్యక్తం చేశారు.

## కరీంనగర్ లో హిందూ అమ్మాయిల మిస్సింగ్ కేసుల పై వేగవంతంగా విచారణ జరపాలి.

### అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించి ఎస్.ఐ.ఆర్ లో తొలగించే విధంగా కలెక్టర్, సిపి చర్యలు చేపట్టాలి.

### జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి



కరీంనగర్, జూలై 16 కరీంనగర్ లో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించి వారిని ఎస్.ఐ.ఆర్ లో నమోదు కాకుండా చూడాలని, అలాగే వారి పై కఠినమైన చర్యలు తీసుకోవాలని మరియు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన హిందూ అమ్మాయిల మిస్సింగ్ కేసుల అంశాల పై కూడా జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్ ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేయాలని జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహణలో భాగంగా బీఎల్ఓలకు తగిన భద్రత కల్పించి ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా కరీంనగర్ లో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించి వారి స్థావరాల పై సమగ్ర తనిఖీలు చేపట్టి అవసరమైన చర్యలు తీసుకునే విధంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో హిందూ అమ్మాయిల మిస్సింగ్ కు సంబంధించి అనేక కేసులు నమోదయ్యాయని, ఈ కేసుల పై కూడా సమగ్ర దర్యాప్తు వేగవంతంగా చేపట్టి బాధిత కుటుంబాలకు తగిన న్యాయం జరిగేలా చూడాలని సీ.పీ గారిని జనసేన పార్టీ పక్షాన బేతి మహేందర్ రెడ్డి కోరారు.

### బహుజన కెరటం

## ప్రొ. ప్రభంజన్ ఆశయాలు చిరస్మరణీయం!

ఘనంగా ప్రథమ వర్ధంతి వేడుకలు



పాలకుర్తి జూలై 16పాలకుర్తి మండల కేంద్రంలో ప్రజా చైతన్యానికి చిరస్మరణీయ దీప్తి, ప్రముఖ సామాజిక బహుజన ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్ట్, విద్యావేత్త, మరియు సామాజిక శాస్త్రవేత్త అయిన ప్రొఫెసర్ ప్రభంజన్ కుమార్ యాదవ్ ప్రథమ వర్ధంతి కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం సాక్షిగా 'అడుగు డిజిటల్ మీడియా' ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక స్మరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, బహుజన నాయకులు, విద్యావంతులు పాల్గొని, ప్రభంజన్ కుమార్ యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.సభలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రొఫెసర్ ప్రభంజన్ కుమార్ యాదవ్ విద్యార్థి దశ నుంచే వామపక్ష, బహుజన సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై, సమాజంలోని బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ ఐ ఐ ఎస్ వంటి అత్యున్నత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించినప్పటికీ, ప్రజా సేవ, సామాజిక న్యాయం కోసం ఆ పదవికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో, బహుజన చైతన్య యాత్రలో కీలకంగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ఒక పక్క జర్నలిజం ప్రొఫెసర్‌గా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దుతూనే, మరోపక్క సత్య శోధక విద్యాపీఠాన్ని స్థాపించి వెనుకబడిన వర్గాలకు బాసటగా నిలిచారని, చివరికి తన మరణానంతరం భౌతిక కాయాన్ని కూడా వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం జనగామ మెడికల్ కాలేజీకి దానం చేసి తుది శ్వాస వరకు ఆదర్శంగా జీవించారని వక్తలు శ్లాఘించారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు, బహుజన రాజ్యాధికారం కోసం రగిల్చిన చైతన్య దీప్తి ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయని నాయకులు స్పష్టం చేశారు. ప్రభంజన్ యాదవ్ కలలుగన్న సామాజిక సమానత్వం, బహుజన సాధికారత సాధించడమే మనం ఆయనకు అందించే నిజమైన నివాళి అని, వారి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోమనాథ కళాపీఠం అధ్యక్షులు డా. రాపోలు సత్యనారాయణ, ప్రజాసంఘాల నాయకులు గుమ్మడిరాజుల సాంబయ్య, పసునూరి నవీన్, సర్పంచులు పోశాల వెంకన్న గౌడ్, మహేందర్ నాయక్, కిరణ్, ఎఫ్ఎస్సిఎస్ వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, పాము శ్రీనివాస్, సంగి వెంకన్న యాదవ్,మాజీ వైస్ ఎంపిపి గూడ దామోదర్, కమ్మగాని వెంకన్న., తోడేటి ఆంజనేయులు, గూడూరు లెనిన్ ,మార్గం సాయి తదితరులు పాల్గొన్నారు

## ప్రమాదంలో గాయపడ్డ యువకుడిని పరామర్శించిన సర్పంచ్.

## 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందచేత.



ఎల్లారెడ్డిపేట ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీకాంత్ ను గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ పరామర్శించారు.ఆయనకు జరుగుతున్న ఫిజియోథెరపీ వైద్య ఖర్చుల కు 5 వేలఆర్థిక సహాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు.సర్పంచ్ తో పాటు గ్రామ వార్డు సభ్యులు కొండ పరశురాములు, పాశం హరీష్, నాయకులు అందె చంద్రం, యువకులు పొన్నాల వెంకటేష్ రెడ్డి, అరవింద్, కొండ సాయి లు పాల్గొన్నారు.

### గుండెపోటుతో గీతా కార్మికుడి మృతి.

# ఎల్లారెడ్డి పేటలో విషాదం.



ఎల్లారెడ్డిపేట న్యూస్.ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన గీత కార్మికుడు పూల్లయ్యగారి నారాయణ (65) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. మృతుడు నారాయణ కు భార్య శోభ,కుమారులు శ్రీనివాస్ ,రాజేష్ కూతురు ఉమ ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని మాజీ ఉప సర్పంచ్ ఒగ్గు రజిత బాలరాజు యాదవ్, మాజీ వార్డు సభ్యులు పందిర్ల శ్రీనివాస్ గౌడ్ తో పాటు పలువురు కోరారు.ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నారాయణ మృతితో ఎల్లారెడ్డి పేట గ్రామంలో విషాదం నెలకొంది.

### తెలంగాణ సహకార రంగం పనితీరుపై ఇరాన్ ప్రతినిధి బృందానికి వివరించిన మంత్రి తుమ్మల



హైదరాబాద్, జూలై 16 న్యూ:రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత ఒ జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి శ్రీ వివేక్ వెంకటస్వామితో కలిసి ఈ రోజు సచివాలయంలో ఇరాన్ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు.ఈ సమావేశంలో ఎ.జు. ఐతీ. వీవఅఝుతీఅ, ఇరాన్ సహకార, కార్మిక మరియు సామాజిక సంక్షేమ శాఖ మంత్రి, ఐతీ. ఝుతీటఅ, సహకార శాఖ ఉపమంత్రి, భారతదేశంలోని ఇరాన్ రాయబారి, ఎ.జు. ఝుఎఅస చాష్ట్రఝుసఅఎవష్ట్ర, హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సుల్ జనరల్, వీతీ. వైస్ కాన్సుల్, వీతీ. ఝుంష్ట్రవఎఅ, ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణలో సహకార ఉద్యమం బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (గాూజూ) పనితీరు, సభ్యత్వ విస్తరణ, రైతులకు అందిస్తున్న సేవలు, సహకార రంగంలో రాష్ట్రం సాధించిన పురోగతిని మంత్రి తుమ్మల ప్రతినిధి బృందానికి వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందని, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు.తెలంగాణలో అమలవుతున్న సహకార విధానాలు, సంస్థాగత సంస్కరణలు, సభ్యులకు అందిస్తున్న సేవలపై ఇరాన్ ప్రతినిధి బృందం ఆసక్తి వ్యక్తం చేసింది. భవిష్యత్తులో సహకార రంగంలో పరస్పర అనుభవాల మార్పిడి, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశాలపై ఇరు పక్షాలు చర్చించాయి.సమావేశం అనంతరం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి ఇరాన్ ప్రతినిధి బృంద సభ్యులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ప్రతినిధి బృందం కూడా మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించింది.

### డాక్టర్ జి.సత్యనారాయణ స్వామి చేతుల మీదుగా ప్రారంభించిన యశోద పిల్లల హాస్పిటల్

బొప్పాపూర్ లో యశోద పిల్లల ఆసుపత్రిని ప్రారంభించిన డాక్టర్ సత్యనారాయణ స్వామి.



ఎల్లారెడ్డిపేట ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ లో గ్రామ మాజీ సర్పంచ్,డాక్టర్ రామ భీమేశ్వర నెలకొల్పిన యశోద పిల్లల,మరియు జనరల్ ఆసుపత్రిని ఎల్లారెడ్డిపేట అశ్విని ఆసుపత్రి వ్యవస్థకులు డాక్టర్ జి సత్యనారాయణ స్వామి ప్రారంభించారు. హైదరాబాద్ నీలోఫర్ హాస్పిటల్ లో వైద్యులుగా పనిచేసిన అనుభవమున్న డాక్టర్ వి.బిందు బొప్పాపూర్ లోని యశోద హాస్పిటల్ లో ప్రతిరోజూ 24. గంటలు పిల్లలకు వైద్య సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇల్లెందుల-గీతాంజలి



శ్రీనివాస్ రెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, బొప్పాపూర్ ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వంగాల వసంత్ కుమార్, ఆర్.ఎం.పి జిల్లా అధ్యక్షులు పి.ప్రవీణ్ రెడ్డి, ఎల్లారెడ్డిపేట మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రాజయ్య , వైస్ ప్రెసిడెంట్ కొండ ఆంజనేయులు, కార్యదర్శి పి.బాల్ రెడ్డి లతో పాటు పలువురు వైద్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పేదింటి స్వంత ఇంటి కళ ఇందిరమ్మ రాజ్యంతోనే సాకారం అయింది- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



2ఏళ్లలో 35వేల కోట్లతో 7లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే.

ఎన్నో గొప్పలు చెప్పిన గత ప్రభుత్వం ఒక్క ఇల్లు అయినా ఇచ్చిందా?

నా రాజకీయ జీవితంలో గొప్ప సంతృప్తి ఇచ్చిన పని దేవాదుల ప్రాజెక్టు....

ఉమ్మడి జిల్లా సాగు, త్రాగు నీటికి పెద్ద దిక్కుగా దేవాదుల నిలుస్తుంది....

దేశవ్యాప్తంగా ఎల్ నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి....

దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి జిల్లాకు సాగు, త్రాగు నీరు అందించే ప్రయత్నం చేస్తున్నాం.....

ధర్మసాగర్ గ్రామ ప్రజలు సహకరిస్తే ఓఆర్ఆర్ నుండి ఎల్కుర్తి క్రాస్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేయిస్తా....

పని చేసే బాధ్యత నాది....

సహకరించాల్సిన బాధ్యత మీది.....

ధర్మసాగర్ న్యూస్దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రిజర్వాయర్లు నింపి ఉమ్మడి జిల్లా ప్రజలకు, రైతులకు త్రాగు నీరు, సాగు నీరు అందించేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారుధర్మసాగర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 92లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభోత్సవంతో పాటు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... పేద ప్రజల స్వంత ఇంటి కళను సాకారం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అని అన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా రెండేళ్లలోనే 35వేల కోట్లతో 7లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అంటూ ఎన్నో గొప్పలు చెప్పిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇంత పెద్ద ధర్మసాగర్ మేజర్ గ్రామ పంచాయతీలో ఒక్క ఇల్లు అయినా ఇచ్చిందా అని ప్రజలను అడిగారు. కానీ నేను ఎమ్మెల్యే అయిన ఈ రెండున్నర ఏళ్లలో 2కోట్ల అభివృద్ధి పనులు చేశానని ఇవాళ ఒక్క రోజే 92లక్షల పనుల ప్రారంభోత్సవం చేసుకున్నామని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు మండల కార్యాలయాల సముదాయం, జూనియర్ కళాశాల, ధర్మసాగర్ రిజర్వాయర్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఎల్ నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఎలాంటి పరిస్థితుల్లో దవాదుల పథకం ఉమ్మడి వరంగల్ జిల్లా సాగు నీరు, త్రాగు నీటికి పెద్దదిక్కుగా నిలుస్తుందని అన్నారు. నా రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తి కలిగించిన పని దేవాదుల ప్రాజెక్ట్ అని అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం మొదటి దశలో ధర్మసాగర్ రిజర్వాయర్ లోకే గోదావరి జలాలు చేరుతాయాని తెలిపారు. ఇక్కడి నుండే స్టేషన్ ఘనపూర్, నవాబ్ పేట, అశ్వరావుపల్లి, గండి రామారం, చిటకోడూరు, బొమ్మకూరు రిజర్వాయర్లకు కూడా నీటిని పంపింగ్ చేయడం జరుగుతుందని చెప్పారు. దేవాదులలోని 10పంపులను 100రోజులు నిరంతరాయంగా నడిపించి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు, రైతులకు సాగు నీరు, త్రాగు నీరు అందించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని వెల్లడించారు. ధర్మసాగర్ గ్రామంలో చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని అన్నారు. రెండో విడతలో ధర్మసాగర్ గ్రామానికి 100ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో గుడిసెలు, పెంకుటిల్లు, కవర్లు కప్పుకొని, రేకుల ఇళ్లలో ఉంటున్న అర్హులైన పేద ప్రజలకు రాజకీయాలకు అతీతంగా చేరేలా చూడాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సూచించారు. ఓఆర్ఆర్ నుండి ఎల్కుర్తి క్రాస్ వరకు నాలుగు లైన్ల రహదారి గా ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నట్లు దీనికి గ్రామ ప్రజలు సహకరించి ముందుకు వస్తే రోడ్డు నిర్మాణం చేసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. అలాగే ధర్మసాగర్ రిజర్వాయర్ ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాచర్ల జ్యోతి-ఏలీయా, తహసీల్దార్, ఎంపిడివో, హౌసింగ్ డిఈ, వివిధ గ్రామాల సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల రెస్టారెంట్ లో బిర్యానీ తిని పలువురి అస్వస్థత. కలకలం రేపిన ఫుడ్ పాయిజన్ ఘటన. ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులు.

ఆహారం కల్తీ వల్లే ఫుడ్ పాయిజన్ అయినట్లు గుర్తించిన వైద్యులు.




ఎల్లారెడ్డిపేట రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఫుడ్ పాయిజన్ ఘటన మరోసారి కలకలం రేపింది. ఇల్లంతకుంట మండలం రామోజీపేట, సిరిసిల్ల అర్బన్ పెద్ద బోనాల, కోనరావుపేట మండలం కొండాపూర్ కు చెందిన పది మంది యువకులు జిల్లా కేంద్రంలోని ఓ మండి బిర్యాని సెంటర్లో బిర్యాని తిని గురువారం అస్వస్థత గురయ్యారు. వాంతులు విరోచనాలు జ్వరంతో కొంతమంది జిల్లా ప్రధాన ఆస్పత్రి, మరి కొంతమంది ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆహార జరగడం వలన బాధితులకు ఫుడ్ పాయిజన్ అయిందని వైద్యులు ప్రాథమిక నిర్ధారణ చేశారు. బకాసుర మండి బిర్యాని సెంటర్లో బిర్యాని తినడం వల్లనే తమకు ఇలా జరిగిందని బాధితులు వాపోతున్నారు. కాగా జిల్లాలో ఇలా వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు ఎక్కడ అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హోటల్లు రెస్టారెంట్లు బిర్యాని సెంటర్లను తనిఖీలు చేసి ఆహార కల్తీలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం ఘనంగా



. స్థానిక వివేకనంద ఒకేషనల్ జూనియర్ కాలేజీ నందు ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా అధ్యక్షుడు చీఫ్ సభ్యులతో మరియు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీచే స్థాపించబడిన ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవం, యువతకు ఉపాధి, గౌరవప్రదమైన పని, వ్యవస్థాపకత మరియు జీవితకాల అభ్యాసం కోసం నైపుణ్యాలను అందించడంలో ఉన్న వ్యూహాత్మక విలువను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యం అని, యువత మంచి ప్రవర్తన అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, భాస్కర్ రెడ్డి, వల్లమల్ల ఆంజనేయులు, ~ గణేష్~ గౌతమ్, సుధాకర్, రాము ,రోజా, అంజలి ,లావణ్య, రాజేష్, క్రీడాకారులు కళాకారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## : ఎల్-నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్, జూలై 16 : రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ను సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు, రైతులను చైతన్య పర్చాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ కార్యాచరణపై జిల్లా కలెక్టర్లతో గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సి.ఎస్ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ముఖ్య కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తూ, యోగితా రాణా, కార్యదర్శి సురేంద్ర మోహన్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటికే పలు జిల్లాల్లో సాధారణ వర్షపాతం కన్నా కనీస వర్షపాతం నమోదైందని, ఈ నేపథ్యంలో కూరగాయలతో పాటు ప్రత్యామ్నాయ పంటలను రైతులు వేసే విధంగా పెద్ద ఎత్తున అవగాహన, చైతన్య కార్యక్రమాలను చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాల్లోని ప్రతీ మండలానికి, డివిజన్లకు ప్రత్యేక అధికారులుగా జిల్లా సీనియర్ అధికారులను నియమించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఎల్ నినో ప్రభావంపై చైతన్య పర్చాలని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రత్యేక ప్రణాళికను వ్యవసాయ శాఖ రూపొందించిందని, ఈ ప్రత్యామ్నాయ ప్రణాళికను విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కంటింజెన్సీ ప్లాన్ ని జిల్లా కలెక్టర్లు గ్రామ స్థాయి వరకు చేరే విధంగా దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా అధిక డిమాండ్ ఉన్న కూరగాయల సాగుకు రైతులను ప్రోత్సహించాలని, , ఈ ఎల్ నినో సమయంలో వారి మినహా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో వ్యవసాయ శాస్త్ర వేత్తల సలహాలు, సూచనలు పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత తీవ్ర వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడం జిల్లా కలెక్టర్లకు ఒక సవాలు అని అన్నారు. ప్రధానంగా, వరి వేస్తే నష్టాలకు గురవుతారని రైతులను చైతన్య పరచాలన్నారు. వీబీజి రాంజీ తోసహా అన్ని పథకాలను ఈ ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలుకు పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని సూచించారు. కాగా, ప్రస్తుత వర్షాకాల సమయంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా, పాఠశాలల్లో విద్యార్థుల ఎన్రోల్ మెంట్ అధికంగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రైతులకు పంటల ఎంపికపై సరైన సూచనలు అందించేందుకు భూగర్భ జలాల శాఖ, నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖల నుంచి క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించి వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సి.ఎస్ ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో నీటి లభ్యత, సాగునీటి వనరులు, విద్యుత్ సరఫరా పరిస్థితులను విశ్లేషించి, వాటికి అనుగుణంగా రైతులు ఏ పంటలు సాగు చేయాలో సూచించాలని తెలిపారు. నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను ప్రోత్సహిస్తూ, రైతులు అలాంటి పంటలనే ఎంపిక చేసుకునేలా వారిలో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వ్యవసాయశాఖ డైరెక్టర్ బి. గోపి, పాఠశాల విద్య సంచాలకులు నవీన్ నికోలస్, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కులవృత్తులను ఎక్కువగా ప్రోత్సహించాలి ప్రభుత్వం కుల వృత్తులకు ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తుంది

రాష్ట్ర రవాణా , బి.సి. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.

బి.సి. కుల వృత్తులను ఎక్కువగా ప్రోత్సహించాలని రాష్ట్ర రవాణా, బి.సి. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆషాఢ బోనాల సందర్భంగా హెచ్ఎండీఏ మైదానంలో "బోనాలు - చేతివృత్తుల మేళాను-2026 ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, శాసన సభ్యులు మక్కన్ సింగ్ ఠాగూర్, ఈర్ల పల్లి శంకర్, కార్పొరేషన్ల చైర్మన్లు, సెక్రెటరీ బాల మాయ దేవి తో కలసి ఆయన





ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆలోచనలకు అనుగుణంగా కులవృత్తులను ప్రోత్సహించడం, బీసీ వర్గాలకు చెందిన కళాకారులకు తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూలై 16 నుంచి 26 వరకు పది రోజులపాటు నిర్వహిస్తున్న ఈ మేళాలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీసీ చేతివృత్తుల కళాకారులకు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కులవృత్తులు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడమే కాకుండా పర్యావరణహితమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కూడా ప్రోత్సహిస్తాయని అన్నారు. సంప్రదాయ ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు భావితరాలకు కులవృత్తుల ప్రాధాన్యతను తెలియజేస్తూ కుల వృత్తుల కళాకారుల జీవనోపాధిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ ప్రదర్శనలను సందర్శించి బీసీ కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇలా చేయడం ద్వారా సంప్రదాయ కులవృత్తులను ఆదరించడమే కాకుండా వేలాది మంది కళాకారుల జీవనోపాధికి తోడ్పాటు అందించినవారవుతారని అన్నారు. ప్రదర్శన ప్రారంభానంతరం మంత్రి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వృత్తి కళాకారులతో ముచ్చటించారు. ఈ ప్రదర్శనలో టెర్రకోట ఉత్పత్తులు, మట్టి పాత్రలు, జనపనార ఉత్పత్తులు, గద్వాల్ చీరలు, పోచంపల్లి ఇకత్ చేనేత వస్త్రాలు, నిర్మల్ బొమ్మలు, నిర్మల్ చిత్రకళా ఉత్పత్తులు, వెండి ఫిలిగ్రీ కళాఖండాలు, వరాహి హస్తకళ ఉత్పత్తులు, వరంగల్ దుర్రీలు, నారాయణపేట చేనేత వస్త్రాలు, పెంబర్తి ఇత్తడి కళాఖండాలు, సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలోని సేంద్రియ ఆహార ఉత్పత్తులు, రానున్న వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలు, పూసల కళాఖండాలు, సంప్రదాయ మందులు, విశ్వకర్మ కళాకారుల ఉత్పత్తులు, ప్రభుత్వ విజయ డెయిరీ ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుల నైపుణ్యాన్ని మంత్రి అభినందిస్తూ, తమ సంప్రదాయ కళలు, కులవృత్తులను భావితరాలకు అందించే దిశగా వారు నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సి. ఈ ఓ ఎబిసి కార్పొరేషన్ అలోక్ కుమార్, సెక్రెటరీ బి.సి రెసిడెన్సీ యల్ సైదులు, ఎం.డి బి.సి. కార్పొరేషన్ మల్లయ్య బట్టు, బి.సి. స్టడీ సర్కిల్ హరికృష్ణ, వివిధ బీసీ కుల కార్పొరేషన్ల చైర్మన్లు, పలు సంఘాలు , అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ఎరువుల నాణ్యత పరీక్షా ప్రయోగశాలకు చీూదీూ గుర్తింపు



తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మరో ప్రతిష్ఠాత్మక విజయాన్ని సాధించింది. రాజేంద్రనగర్‌లోని ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు ప్రయోగశాలకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (చీూదీూ) గుర్తింపు లభించింది. ఈ గుర్తింపుతో ప్రయోగశాల అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తోందని అధికారికంగా ధృవీకరించబడింది. దీనివల్ల రైతులకు అందుతున్న ఎరువుల నాణ్యత పరీక్షలు మరింత ఖచ్చితత్వంతో, విశ్వసనీయంగా నిర్వహించబడనున్నాయి. రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ప్రయోగశాల 17025:2017 ప్రమాణాలను విజయవంతంగా అమలు చేసి, ఎరువుల రసాయన విశ్లేషణలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన సాంకేతిక సామర్థ్యాన్ని నిరూపించింది. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న తొమ్మిది నాణ్యత నియంత్రణ ప్రయోగశాలలు (ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు)లో రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ప్రయోగశాలే తొలిసారిగా చీూదీూ గుర్తింపు పొందిన ప్రయోగశాలగా నిలిచింది. ఈ ప్రయోగశాలలో ప్రస్తుతం మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ పౌడర్ మరియు (గ్రాన్యులర్) ఎరువుల నాణ్యత పరీక్షలకు చీూదీూ గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు తెలంగాణ ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖకు గర్వకారణం. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇది మరింత బలాన్ని చేకూరుస్తుంది.



అలాగే ఎరువుల నాణ్యతపై రైతుల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, రాష్ట్రంలో నాణ్యత నియంత్రణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంలో ఈ గుర్తింపు కీలక పాత్ర పోషించనుంది. రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ప్రయోగశాలకు లభించిన చీూదీూ గుర్తింపు రాష్ట్రంలోని ఇతర వ్యవసాయ నాణ్యత నియంత్రణ ప్రయోగశాలలకు కూడా దశలవారీగా చీూదీూ గుర్తింపు కల్పించే ప్రక్రియకు నాంది పలికింది. రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ ప్రయోగశాలలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం ద్వారా నాణ్యమైన వ్యవసాయ సేవలను రైతులకు అందించడం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని ఈ ఘనత మరోసారి చాటిచెబుతోంది. ఈ సందర్భంగా చీూదీూ గుర్తింపు పత్రం గురించి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారికి వివరించారు. అనంతరం మంత్రి గారి చేతుల మీదుగా చీూదీూ గుర్తింపు పత్రాన్ని వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ కె. సురేంద్ర మోహన్, ఐఏఎస్, వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐఏఎస్, మరియు వ్యవసాయ శాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ప్రయోగశాలకు చీూదీూ గుర్తింపు లభించడం రాష్ట్ర వ్యవసాయ శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా నాణ్యత నియంత్రణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, రాష్ట్రంలోని ఇతర వ్యవసాయ నాణ్యత నియంత్రణ ప్రయోగశాలలకు కూడా దశలవారీగా చీూదీూ గుర్తింపు పొందేలా అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. డా. బి. గోపి, ఐ.ఏ.ఎస్‌సంచాలకులు, వ్యవసాయ శాఖతెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్

## ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు చరమగీతం పాడుతాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సచివాలయంలో 'రోహిత్ వేముల చట్టం' ముసాయిదాపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం

ఆనాటి హామీని నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం.. వివక్ష లేని విద్యా విధానమే మా లక్ష్యం

సమగ్ర ముసాయిదా నివేదికను వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం

సమావేశానికి హాజరైన మంత్రులు (కమిటి సభ్యులు) దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్.

ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులపై జరిగే గుర్తింపు ఆధారిత వివక్షకు శాశ్వతంగా అడ్డుకట్ట వేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నివారణ) బిల్లు, 2026 రూపకల్పనపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ తొలి కీలక సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సీఎం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో వివక్ష లేని ప్రశాంత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం చట్టాన్ని అత్యంత పటిష్టంగా రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (ఎజఖ)లో జరిగిన రోహిత్ వేముల విషాద ఉదంతం కేవలం తెలంగాణనే కాకుండా దేశం మొత్తాన్ని కదిలించిందని ఆయన అన్నారు. ఆనాడు వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన పోరాటంలో ప్రస్తుత లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా యూనివర్సిటీకి వచ్చి సంఘీభావం ప్రకటించారు. ఆనాడు విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ.. నాటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా నేను ( భట్టి విక్రమార్క)మంత్రి శ్రీధర్ బాబు, క్రియాశీలక నేత పొన్నం ప్రభాకర్ మేమంతా పెద్ద ఎత్తున పోరాడాం. భవిష్యత్తులో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాల్లో ఎటువంటి వివక్ష లేని విద్యా విధానాన్ని, చట్టాన్ని తీసుకువస్తామని ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని మా ప్రభుత్వం ఈ రోజు నెరవేర్చడానికి రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తుందని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతకాలని, వివక్ష కారణంగా ఎవరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉండకూడదన్న రాహుల్ గాంధీ ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటయిందని ఆయన స్పష్టం చేశారు. అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశాలుబిల్లు రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు డ్రాఫ్టింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. కొత్త చట్టానికి సంబంధించిన సమగ్ర విధివిధానాలతో కూడిన ప్రాథమిక ముసాయిదా (ఐతీఖట్) నివేదికను సిద్ధం చేయాల్సిందిగా సంబంధిత శాఖ సెక్రటరీని ఆదేశించారు. కర్ణాటకలో ఇప్పటికే ఇటువంటి చట్టం కోసం జరుగుతున్న ముసాయిదా ప్రయత్నాలను పరిశీలించి, అక్కడి ఉత్తమ పద్ధతులను స్వీకరించాలని సూచించారు. ఈ చట్టం రూపకల్పనలో ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకెళ్తామని, ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని ప్రకటించారు. వివిధ రాజకీయ పక్షాల నేతలు, ప్రజా సంఘాలు, స్టూడెంట్ అసోసియేషన్ల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానిస్తున్నామని.. ప్రజల నుంచి వచ్చే స్పందనను బట్టి బిల్లులో తుది మార్పులు ఉంటాయని స్పష్టం చేశారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, క్యాబినెట్ సబ్-కమిటీ ఆమోదం పొందిన అనంతరం ఈ చారిత్రాత్మక బిల్లును త్వరలోనే రాష్ట్ర శాసనసభ (అసెంబ్లీ) ముందుకు తీసుకువస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

### న్యాయపరంగా పటిష్టంగా ఉండాలి:

ఈ చట్టానికి భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు, సుప్రీంకోర్టు అడ్వకేట్, సామాజిక కార్యకర్త దిశా వాడేకర్‌ను ప్రత్యేక ఆహ్వానితురాలిగా పిలిపించి చర్చించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కొలంబియా లా స్కూల్ (న్యూయార్క్) నుండి ఎల్.ఎల్.ఎమ్ పూర్తి చేసిన ఆమె అనుభవం చట్టాన్ని అత్యంత సమగ్రంగా, లోపరహితంగా తీర్చిదిద్దడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

